ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
ఆదివారం అక్టోబరు 6, 2024

అన్న ప్రసాదిని.. అభయ ప్రదాయిని..




భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన


మంగళహారతికి ప్రణమాంజలి


నగర వీధుల్లో ఊరేగింపు


అంతరాలయం చెంత కిటకిట


కోలాట వైభవం


భక్తితో సువాసినీ పూజ..


కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు పర్యవేక్షణ


తృప్తిగా భోజనం చేస్తూ..


నృత్య నీరాజనం..

అన్నపూర్ణాదేవి దర్శనానికి.. పోటెత్తిన భక్తజనం

విజయవాడ దుర్గగుడిలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజు శనివారం అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చింది. శనివారం ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి రద్దీ కొనసాగింది. రాత్రి 11 గంటల వరకూ సుమారు 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజుల్లో రెండు లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. నిత్యం సాయంత్రం వేళ మహానివేదన, పంచ హారతులు, చతుర్వేద స్వస్తి నిర్వహిస్తున్నారు. ఇందుకు సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకూ దర్శనాలను ఆపుతున్నారు. అందుకే సాయంత్రం నుంచి క్యూలైన్లలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటోంది.

కానుకల వెల్లువ.. ఏటా కానుకలు, హుండీ ఆదాయం, పూజలు, దర్శనాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.15 కోట్ల ఆదాయం వస్తుంది. ఈ ఏడాది అదనంగా ఆభరణాలను భక్తులు సమర్పిస్తున్నారు. ఓ అజ్ఞాత భక్తుడు తొలిరోజు రూ.2.50 కోట్ల విలువైన వజ్రకిరీటాన్ని ఇచ్చారు. తాజాగా రూ.18 లక్షల విలువైన బంగారు మంగళ సూత్రాలను, ఆరు కిలోల భారీ వెండి హంస పీఠాన్ని సమర్పించారు..



నేడు ఆదివారం కావడంతో దుర్గగుడికి భారీగా భక్తులు తరలిరానున్నారు. రోజు సాయంత్రం దుర్గాఘాట్‌లో నిర్వహిస్తున్న నదీ హారతి, కనకదుర్గానగర్ నుంచి ఆరంభమవుతున్న నగరోత్సవం కనులపండువలా సాగుతున్నాయి.



నేడు శ్రీలలితా త్రిపురసుందరీదేవి దర్శనం..

దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వబోతోంది.

దర్శన సమయాలు: వేకువన 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు.


జయము జయము దుర్గమ్మ


భలే ఉంది


పరమేశ్వరీ ప్రణతి


రూ.18 లక్షల విలువైన బంగారు మంగళ సూత్రాలు అందజేస్తున్న.. కొండపి వ్యాపారి అంకురయ్య దంపతులు


వెండి హంస పీఠాన్ని సమర్పిస్తున్న చేబ్రోలు పుల్లయ్య (గుంటూరు)

– ఈనాడు, డిజిటల్ అమరావతి – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు సిద్ధం

ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు


సభకు హాజరైన అభిమానులు, కూటమి శ్రేణులు


కొనకళ్లను అభినందిస్తున్న ఎంపీలు బాలశౌరి, కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. శనివారం ఆయన విజయవాడ ఆర్టీసీ భవన్‌లో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మిక సంఘాలకు అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెడుతూ... సంస్థను లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... ఏపీఎస్‌ఆర్టీసీకి మంచి రోజులు వచ్చాయని, కార్మికుల సమస్యలు తెలిసిన నారాయణరావు సారథ్యంలో ఆర్టీసీ మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విలీనం పేరుతో ఆర్టీసీని నష్టాల బాట పట్టించి కార్మికుల సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ... అజాత శత్రువైన కొనకళ్ల అందరితో స్నేహభావం కలిగి ఉంటారని, ఇద్దరం కలిసి పదేళ్లు ఎంపీలుగా పని చేశామని గుర్తు చేశారు. ఆయన హయాంలో ఆర్టీసీ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


కొనకళ్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్. పక్కన మంత్రి కొల్లు రవీంద్ర

వెలుగుబాట పట్టించాలి..

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రస్తుతం అంధకారంలో ఉన్నదని, వెలుగు బాట పట్టించాల్సిన బాధ్యత కొనకళ్లపై ఉందన్నారు. కొనకళ్ల సామర్థ్యాన్ని గుర్తించి ముఖ్యమంత్రి ఆర్టీసీ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... అన్ని ప్రాంతాలకు బస్సులు వెళ్లేలా, పేదలకు బస్సు ప్రయాణం మరింత సులభతరం అయ్యేలా కొనకళ్ల చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు.

చిత్తశుద్ధితో వరించిన పదవి..

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ... కొనకళ్ల వ్యక్తిత్వం, ప్రజా సమస్యల పరిష్కారంపై ఆయనకున్న చిత్తశుద్ధి కారణంగానే ఆర్టీసీ ఛైర్మన్ పదవి దక్కిందన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ.. నిరాడంబర వ్యక్తిత్వంతో ప్రజలకు విలువైన సేవలందించిన వ్యక్తి కొనకళ్ల అని కొనియాడారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పార్టీ కోసం శ్రమించిన నారాయణరావుకు ఆర్టీసీ ఛైర్మన్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, పంచకర్ల రమేష్‌బాబు, కామినేని శ్రీనివాస్, తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రామారావు తదితరులు పాల్గొన్నారు.

దసరా తిరుగు ప్రయాణాలకు గిరాకీ

ఈనాడు - అమరావతి



దసరా ప్రయాణాలపై ఈసారి మిశ్రమ స్పందన కనిపిస్తోంది. విజయవాడ నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే సర్వీసులకు రిజర్వేషన్లు వేగంగా కావడం లేదు. ఎక్కువ డిమాండ్ తిరుగు ప్రయాణాలకే ఉంది. ఇప్పటికే రోజువారీ తిరిగే సర్వీసులు దాదాపు నిండాయి. ప్రత్యేక బస్సులు ఇప్పుడిపుడే నిండుతున్నాయి. ఈ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

విపరీతమైన డిమాండ్...

పండగకు వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన వారు.. తిరిగి వెళ్లేందుకు బస్సులకు రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు. దసరా మరుసటి రోజు ఆదివారం కావడంతో 13న ఎక్కువ మంది తమ సీట్లను రిజర్వు చేసుకున్నారు. మిగిలిన వారు 14వ తేదీ రాత్రి బుక్ చేసుకుంటున్నారు. ఈ రెండు రోజుల్లోనే అధిక ప్రయాణాలు ఉన్నాయి. రెగ్యులర్ సర్వీసులు.. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు 130, విశాఖపట్నం.. 87, తిరుపతి వైపు.. 70, రాయలసీమ ప్రాంతానికి 77 తిరుగుతుంటాయి. వీటిల్లో ఇప్పటికే దాదాపు 95 శాతం సీట్లు బుక్ అయ్యాయి. దీంతో పండగ ప్రత్యేక బస్సుల్లోనూ ముందస్తు రిజర్వేషన్లు మొదలయ్యాయి. రెండు, మూడు రోజుల్లో ఇవి కూడా నిండే వీలుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు అంతంతే..

ఇప్పటికే విద్యా సంస్థలకు దసరా సెలవులు ఇచ్చారు. అమ్మవారి శరన్నవ రాత్రి ఉత్సవాలు కూడా ప్రారంభమయ్యాయి. కానీ విజయవాడ నుంచి హైదరాబాద్, ఉత్తరాంధ్ర, తిరుపతి, రాయలసీమ ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ సర్వీసుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటికి పెద్దగా రిజర్వేషన్లు కావడం లేదు. ఈనెల 5వ తేదీ నుంచి పండగ ముందు రోజు వరకు చూస్తే.. అన్ని బస్సుల్లో సుమారు 70 శాతం పైగా సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. విజయవాడ చుట్టుపక్కల ఉత్తరాంధ్ర జిల్లాల వారు ఎక్కువ మంది ఉన్నారు. అయినా ఈసారి విశాఖపట్నం వైపు వెళ్లే బస్సులకు రిజర్వేషన్లు కావడం లేదు. గత నెలలో నగరాన్ని అతలాకుతలం చేసిన వరదల కారణంగా పలువురు ప్రయాణాలను వాయిదా వేసుకున్నట్లు భావిస్తున్నారు.

☛ ఇక్కడి నుంచి వెళ్తున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారు. విజయవాడ చుట్టుపక్కల జూనియర్ కళాశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. వీరంతా వేర్వేరు జిల్లాల నుంచి వచ్చి చదువుతున్నారు. కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో శుక్రవారం నుంచి తమ ప్రాంతాలకు పయనమయ్యారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, రాయలసీమ ప్రాంతాలకు భారీగా వెళ్లారు. ఈ మార్గాల్లో రెగ్యులర్ సర్వీసులు 150 నడుస్తుంటాయి. విద్యార్థులు సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. శుక్రవారం 45, శనివారం 36 ప్రత్యేక బస్సులు తిరిగాయి.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు కమ్మ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కమ్మ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బీ బ్లాక్ మూడవ అంతస్తులోని ఈనాడు ఆఫీస్ వేదికగా నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (06 అక్టోబర్ 2024, ఆదివారం)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 80080 01686 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.


★ **ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు.** రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలియచేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

విజయవాడ-కుప్పం నూతన సర్వీసుల ప్రారంభం


ఇంద్ర బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే : అధునాతన సౌకర్యాలతో కూడిన రెండు నూతన ఇంద్ర బస్సులను శనివారం ఆర్టీసీ హౌస్ వద్ద ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. ఈ బస్సులు ప్రతి రోజు విజయవాడలో రాత్రి 8.10 గంటలకు, కుప్పంలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరుతాయని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై దానం తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఏ) బ్రహ్మానందరెడ్డి, విజయవాడ డిపో మేనేజర్ శర్మ, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఐవీఆర్ఎస్ విధానంలో అభిప్రాయ సేకరణ


శ్రీదుర్గా సౌందర్యలహరి పుస్తకం ఆవిష్కరిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలపై ఐవీఆర్ఎస్ విధానంలో భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఇటీవల సహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మ చేసిన అవధానంలోని పద్యాలను 'శ్రీదుర్గా సౌందర్యలహరి' పేరుతో గ్రంథంగా తీసుకొచ్చారు. సదరు పుస్తకాన్ని ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్ వద్ద శనివారం మంత్రి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు, ఈఈ రమాదేవి పాల్గొన్నారు.

2029 కల్లా న్యూయార్క్‌కు విమానం నడుపుతాం

త్వరలో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి, ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ డీకే బాలాజీ, డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్పీ గంగాధరరావు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: 2029 నాటికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాలోని న్యూయార్క్ నగరానికి విమాన సర్వీసు నడిపేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు విమానాశ్రయం అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన సలహా కమిటీ సమావేశంలో ఆయన కమిటీ వైస్ ఛైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కలెక్టర్ డీకే బాలాజీ, డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్పీ గంగాధరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతికి ప్రముఖుల తాకిడి రోజురోజుకు మరింత పెరుగుతున్నందున వీలైనంత త్వరగా నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇప్పటికే వివిధ కారణాలతో ఆలస్యమైన టెర్మినల్ నిర్మాణ పనులను ముందస్తుగా నిర్ణయించిన 2025 జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేయాలన్నారు. ముంబయి సర్వీసును అహ్మదాబాద్ వరకు, విశాఖ సర్వీస్ కోల్‌కతా వరకు పెంచడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి కోసం సింగపూర్, థాయ్‌లాండ్, శ్రీలంకలకు సర్వీసులు నడపాలని కేంద్రం, విమానయాన సంస్థలను కోరినట్లు వెల్లడించారు. ఇక్కడి నుంచి దుబయ్‌కు ఎమిరేట్స్ సర్వీస్ వస్తే యూకే, అమెరికా, ఇతర దేశాలకు ప్రయాణికుల రాకపోకలకు మరింత సౌకర్యంగా ఉంటుందని కేంద్రానికి వివరించినట్లు చెప్పారు. కమిటీ వైస్ ఛైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ నూతనంగా నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనుల్లో వేగం మరింత పెంచాలని.. అవసరమైతే వారాంతపు సమీక్షలు నిర్వహించాలన్నారు. భద్రత నేపథ్యంలో విమానాశ్రయం ఆవరణలో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ గంగాధరరావు కమిటీని కోరారు.


ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన నమూనా

నిర్వాసితులు, ఇతర సమస్యల పరిష్కారం..

విమానాశ్రయ విస్తరణలో భాగంగా స్థలాలు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలను సత్వరమే నెరవేర్చాలని సలహా కమిటీ నిర్ణయించింది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, ఏలూరు కాలువపై పైవంతెన నిర్మాణం, కాలువ మళ్లింపు, ప్రైవేట్ లేఔట్ బాధితులకు అజ్జంపూడిలో ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు సహా ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది.

రైతుల అభ్యున్నతికి కృషి చేస్తా



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి. వేదికపై కొనకళ్ల నారాయణ, మంత్రి జనార్దన్‌రెడ్డి, డిల్లీరావు తదితరులు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మన్నే సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి బి.సి. జనార్దన్‌రెడ్డి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందన్నారు. డైరెక్టర్లుగా జగదీశ్వరీ, కమతం కాటమయ్యలు బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ డిల్లీరావు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, డోన్ నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నదీ తీరాన పర్యాటక శాఖ భారీ కార్యక్రమం

ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహణ


ఘాట్ వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు

భవానీపురం, న్యూస్‌టుడే : దసరా నేపథ్యంలో కృష్ణానది ఒడ్డున పున్నమి ఘాట్ వేదికగా ఏపీ పర్యాటక శాఖ అధికారులు భారీ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒడ్డున ఉన్న స్థలంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 11న మహిళలకు సంబంధించి సదస్సు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఆ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సతీమణులు హాజరవుతారని సమాచారం. 12న దసరా నేపథ్యంలో భారీ కార్యక్రమం జరగనుంది. కృష్ణానదికి హారతులు ఇవ్వనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డ్రోన్ షో, లేజర్ షోలు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. ఆకాశంలో మిరుమిట్లు గొలిపేలా భవానీ ద్వీపం వద్ద నుంచి బాణసంచాను భారీ ఎత్తున కాల్చనున్నారు. 13న ముగింపు కార్యక్రమం ఉంటుంది. ప్రస్తుతం ఘాట్ వద్ద వేదిక, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కార్యక్రమాలకు సంబంధించి పూర్తి సమాచారం తెలియజేస్తామని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. దీనిపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు.

కార్పెట్‌పై కార్లు.. కాళ్లు కాలుతూ భక్తులు


కార్పెట్‌పై నిలిపిన కారు.. ఎండలో సిమెంట్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు





దసరా శరన్నవ రాత్రుల సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. ఎండలో వారి కాళ్లు కాలకుండా ఘాట్ రోడ్డులో ఓం మలుపు నుంచి కార్పెట్ ఏర్పాటు చేశారు. కొంతమంది వీఐపీల వాహనాలు ఓం మలుపు దాటి గుడిముందు వరకూ తీసుకెళ్తున్నారు. తరువాత వాహనాలను తెచ్చి కార్పెట్‌లపై నిలిపేస్తున్నారు. దీంతో సిమెంట్ రోడ్డుపై కాళ్లు కాలుతూ భక్తులు పరుగులు తీస్తున్నారు. కార్ల టైర్లు కాలకుండా కార్పెట్లపై పెడితే భక్తులు ఇబ్బంది పడుతున్నారని, ఆలయ అధికారులు, సిబ్బంది దీనిపై దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

అవగాహనతోనే అడ్డుకట్ట..!


సైబర్ నేరాలపై వినూత్న ప్రచారం



ప్లకార్డులతో స్కేటర్లు

దసరా ఉత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు అవగాహన కలిగించేందుకు విజయవాడ పోలీసులు 'సైబర్ మారథాన్' నిర్వహిస్తున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శనివారం పలువురు స్కేటర్లు 'ఐ యామ్ సైబర్ సిటిజన్' ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ చేశారు. వినాయకుడి గుడి నుంచి కుమ్మరిపాలెం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఇతర సమస్యలు తెలియజేసే ప్లకార్డులతో అవగాహన కలిగిస్తూ అందరినీ ఆకర్షించారు. **- న్యూస్‌టుడే, విజయవాడ నేరవార్తలు**

పట్టభద్రుల ఓటు నమోదుకు ప్రత్యేక కేంద్రం


మాట్లాడుతున్న విద్యాసాగర్. పక్కన సత్యనారాయణరెడ్డి, రమేష్, సతీష్, రాజబాబు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదుకు గాంధీనగర్ ఎన్జీవో భవన్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు. పట్టభద్రులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నమోదుకు నవంబరు 6వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు. శనివారం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులతోపాటు పట్టభద్రులైన కుటుంబ సభ్యులను ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు సంఘం నాయకులు, ఈసీ సభ్యులు సమాచారం తెలియజేసి, చైతన్యపరచాలని కోరారు. ఫారం 18 తదితర పత్రాలన్నీ అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లోని ఎన్జీవో హోమ్‌లోనూ ఈ సదుపాయం ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, సతీష్, ఎం.రాజబాబు, బి.వి.రమణ, డి.విశ్వనాథ్, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్, పి.రాజశేఖర్, వి.వి.ప్రసాద్, శ్రీనివాస్, మధుసూదన్, శివశంకర్, రామాంజనేయులు, శివలీల, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతకు మంగళ సూత్రాలు.. హంసపీఠం బహూకరణ


ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు ఇద్దరు దాతలు బంగారు మంగళ సూత్రాలు, వెండి హంసపీఠాన్ని అలంకరణ నిమిత్తం శనివారం అందజేశారు. ప్రకాశం జిల్లా కొండెపి పట్టణానికి చెందిన అంకురయ్య చిరు వ్యాపారి. జగన్మాతపై అచంచలమైన భక్తితో ఏటా పట్టణంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ఏదైనా చేయాలని తలంపుతో వేద పండితుడు శ్రీనివాసశాస్త్రిని సంప్రదించగా మంగళసూత్రాలు అయితే నిత్యం అలంకరణకు వినియోగించే అవకాశం ఉంటుందని చెప్పారు. శక్తికి మించిన భారమైనప్పటికీ అమ్మపై ఉన్న విశ్వాసంతో రూ.18లక్షల విలువైన మంగళ సూత్రాలను బహూకరించినట్లు దాత కుటుంబం తెలిపింది. దేవస్థానం ఈవో రామారావు, సీపీ రాజశేఖర్ బాబు మంగళసూత్రాలను దాత కుటుంబం నుంచి స్వీకరించారు.

☛ గుంటూరుకు చెందిన చేబ్రోలు రాజకుమారి 6 కిలోల బరువున్న వెండి హంసపీఠాన్ని శనివారం అందజేశారు. జగన్మాత దుర్గమ్మ మూల విరాట్ వద్ద హంసపీఠాన్ని ఉంచి పూజ చేసిన అనంతరం దానిని వైదిక కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు పద్మశేఖర్ పాల్గొన్నారు.

డూప్లికేట్ పత్రాలకు దరఖాస్తులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, ఒకేషనల్, డీ.ఈఎల్.ఈడీ, టీటీసీ తదితర ధ్రువపత్రాలు తడిసి పాడైపోయిన అభ్యర్థులు డూప్లికేట్ పత్రాల కోసం ఈ నెల 12వ తేదీలోపు ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు శనివారం తెలిపారు. దరఖాస్తుదారుడి చిరునామాతో పాటు సొంత డిక్లరేషన్, ఆధార్ కార్డు జెరాక్స్ (నివాసం చిరునామా కోసం), కావాల్సిన ధ్రువపత్రాల నకళ్ల కాపీ (ఉంటేనే)ని జిల్లా విద్యాశాఖాధికారి పేరుతో పెట్టుకున్న దరఖాస్తులను సంబంధింత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని కోరారు. అక్కడ నుంచి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి అవి చేరుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)




వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

నీటి సంపులో పడి బాలుడి మృతి


కార్తీక్ (పాత చిత్రం)


కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడడంతో బాలుడు మృతి చెందిన ఘటన శనివారం కంచికచర్లలో చోటుచేసుకుంది. బాలుడి బంధువుల వివరాల ప్రకారం.. కంచికచర్ల అరుంధతీ కాలనీకి చెందిన జల్లి బుల్లియ్య దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆ దంపతుల కుమారుడు కార్తీక్(5) శనివారం ఉదయం ఆడుకుంటూ ఎదురింట్లో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లాడు. నీటి సంపుపై ఉన్న ప్లాస్టిక్ రేకుపై ఎక్కి ఆడుకుంటూ ఉండగా రేకు విరగడంతో అందులో పడిపోయాడు. సంపు నిండా నీరు ఉండి లోతుగా ఉండడంతో బాలుడికి కాళ్లు అందక నీట మునిగిపోయాడు. బాలుడు కనిపించకపోవడంతో వెతుకుతున్న తల్లిదండ్రులు సంపు వద్ద గమనించే సరికి బాలుడు మృతి చెంది ఉన్నాడు. ఆటలాడుకునే ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

ప్రజల్లోకి 'శాప్' కార్యకలాపాలు


మాట్లాడుతున్న రవినాయుడు. పక్కన గిరీశ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) నిర్వహించే పనులన్నీ ప్రజల్లోకి వెళ్లాలని ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో శనివారం ఎండీ పీఎస్ గిరీషాను ఆయన కలిశారు. అనంతరం శాప్ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఛైర్మన్‌కు ఆయన వివరించారు. తరువాత జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ)ల పనితీరు, మైదానాలు, క్రీడాకారులకు సదుపాయాలు, నిధులు, పాలసీలు, జీవోలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ.. శాప్‌లో గతంలో, ప్రస్తుతం, రానున్న కాలంలో చేయబోయే పనుల వివరాలు ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని తెలిపారు. క్రీడాకారులు, ప్రజలకు శాప్ జవాబుదారీతనంతో పని చేస్తుందనే విషయం తెలియాలన్నారు. క్రీడారంగానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, గత ప్రభుత్వ పొరపాట్లను సరిదిద్దుతూ శాప్‌ను ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు. శాప్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఎండీ గిరీశ మాట్లాడుతూ ఛైర్మన్ సూచనలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన క్రీడల అధికారి ఎస్.వెంకట రమణ, ఇంజినీరింగ్ విభాగం ఈఈ సిద్ధయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో శ్రమజీవులు ఉపాధ్యాయులే


మోహనరావు దంపతులను సత్కరిస్తున్న తాతయ్య, లక్ష్మణరావు తదితరులు

జగ్గయ్యపేట: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే నిరంతర శ్రమజీవులని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావులు అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అప్సా డెమోక్రటిక్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అప్సా జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కాలేషా అధ్యక్షతన జరిగిన ఈ సభలో వారు మాట్లాడుతూ. . ఉపాధ్యాయులంతా సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్‌కలాం వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన 15 మంది ఉపాధ్యాయులను, జిల్లాలో 21 మందిని, నియోజకవర్గంలో 73 మంది ఉపాధ్యాయులకు విద్యాసేవ పురస్కారాలను అందించారు. కేడీసీసీబీ మాజీ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరారావు, ఎంఈఓలు చిట్టిబాబు, నాగరాజు, అప్సా డివిజన్ ప్రతినిధులు రమేష్, బాలాజీ, భరద్వాజ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ సీఎన్‌జీ ద్విచక్ర వాహనం ఆవిష్కరణ


ద్విచక్రవాహనంపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అనూరాధ. చిత్రంలో ప్రతినిధులు

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : కాలుష్యం, ఖర్చు తగ్గించుకోవాలంటే పర్యావరణ హిత ద్విచక్రవాహనాలను వినియోగించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బెంజి సర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో శనివారం వరుణ్ బజాజ్ 25వ వార్షికోత్సవం నిర్వహించారు. తొలి సీఎన్‌జీ ద్విచక్రవాహనం బజాజ్ ఫ్రీడమ్ 125ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరుణ్‌బజాజ్ కొన్నేళ్లుగా నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతోందని పేర్కొన్నారు. వరుణ్ బజాజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ.. 25 ఏళ్లలో ఇప్పటివరకు 3.75 లక్షల ద్వి, త్రిచక్ర వాహనాలను విక్రయించామని, 20.5 లక్షల మంది వినియోగదారులకు సేవలందించామని వెల్లడించారు. బజాజ్ ఫ్రీడమ్ ద్విచక్ర వాహనానికి రెండు ట్యాంక్‌లున్నాయని, ఒకటి పెట్రోలు, మరొకటి సీఎన్‌జీకి వాడొచ్చని తెలిపారు. బజాజ్ ఆటో రీజనల్ మేనేజర్ (సేల్స్) సి.ఎస్.కరుణాకరన్, ఆటో రీజనల్ మేనేజర్ (సర్వీస్) సచిన్ జైన్, ఏరియా సేల్స్ మేనేజర్ సాదత్ బాషా, ఏఎస్ఎం అశోక్‌రెడ్డి, జీఎం పద్మజ పాల్గొన్నారు. ద్విచక్రవాహనాన్ని రామ్మోహన్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అనూరాధ, తెదేపా యువనేత గద్దె క్రాంతి కుమార్ ఆవిష్కరించి కొనుగోలుదారులకు తాళాలు అందించారు.

సెల్‌పాయింట్‌లో రజతోత్సవం, దసరా ఆఫర్లు

విశాఖపట్నం (కార్పొరేషన్), న్యూస్‌టుడే: మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల రిటైలర్ సెల్‌పాయింట్ ఇండియా లిమిటెడ్ రజతోత్సవం, దసరా పండుగ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. లక్కీడ్రాలో మోటార్‌బైక్‌లు, మొబైల్‌ఫోన్లు బహుమతులుగా గెలుచుకోవచ్చని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్‌ప్రసాద్ పాండే తెలిపారు. డెబిట్‌కార్డు, ఈఎంఐ, క్రెడిట్ కార్డు ఈఎంఐలతో సహా వడ్డీలేని సులభమైన పద్ధతిలో చెల్లించే సదుపాయం కల్పించారు. ఒప్పో ఎఫ్ 27 5జి సిరీస్, రెనో 12ప్రో 5 జి కొనుగోలుపై రూ.10లక్షల వరకు పొందే అవకాశం, కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై రూ.20వేల వరకు తగ్గింపు, భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాక్ సదుపాయం, అప్‌గ్రేడ్, మార్పిడి చేయడం ద్వారా రూ.20వేల వరకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. శ్యామ్‌సంగ్, ఎంఐ, ఎల్‌జి, సోని, వర్ల్‌పూల్, హయర్, ఏస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై 50శాతం వరకు తగ్గింపు, అన్ని బ్రాండ్ల యాక్సెసరీస్‌పై 60శాతం తగ్గింపు పొందవచ్చని తెలిపారు. సెల్‌పాయింట్ అన్ని రిటైల్ అవుట్‌లెట్స్‌లో, ఆన్‌లైన్ వేదికపై ఆఫర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

సూపర్-6 పథకాలు అమలు చేయండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని సీపీఐ నాయకులు విమర్శించారు. విస్సన్నపేటలో శనివారం జరిగిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి.కృష్ణయ్య, నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల్ మీరా, మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయకుండా ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు కృష్ణయ్య

స్వర్గపురి వాహనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మునుకుళ్ల దారిలో పోతుల చెరువు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికకు (స్వర్గపురి) పార్థివదేహాలను తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలుకు తిరువూరుకు చెందిన వైద్యుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు శనివారం రూ.లక్ష విరాళం అందించారు. వితరణ చెక్కును తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) సభ్యులు రవికుమార్, శ్రీనివాస్, మురళీకృష్ణ, కృష్ణాంజనేయులు, మోహన్‌రావు, రహీం, నరసింహారావు తదితరులకు అందజేశారు.


తోసా సభ్యులకు చెక్కు అందజేస్తున్న దాత డాక్టర్ రామకోటేశ్వరరావు

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపీనాయక్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. డీఈవో, ఆర్ఐ తనిఖీలు నిర్వహించి తరగతులు నిర్వహించే విద్యాసంస్థల గుర్తింపును రద్దుచేయాలని కోరారు.

మంచిదే అంతిమ విజయం

కంచికచర్ల, న్యూస్‌టుడే: చెడుపై మంచిదే అంతిమ విజయమని, దానికి ప్రతీకగానే మనం విజయ దశమి చేసుకుంటామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ఆయుధ పూజకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. దుష్టశక్తుల నుంచి ప్రజలను కాపాడే అమ్మవారిలానే పోలీసు వ్యవస్థ కూడా ప్రజలను కాపాడాలన్నారు. సీఐ చవాన్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ తెదేపా కార్యకర్తల సమావేశం నేడు

తిరువూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ తెదేపా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు పట్టణంలో రాజుపేట శ్రీరస్తు కల్యాణ మండపంలో నిర్వహిస్తారని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు కార్యాలయం నుంచి శనివారం ప్రకటన వెలువడింది. ఎంపీ కేశినేని శివనాథ్, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, పార్టీ జిల్లాధ్యక్షుడు నెట్టెం రఘురామ్, పార్టీ జోన్-3 సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజు, నియోజకవర్గ పరిశీలకుడు సీహెచ్.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.దేవదత్ పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు. గత పది రోజులుగా నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి సమన్వయంతో ముందుకు సాగించేందుకు అధిష్ఠానం ఆదేశంతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

చివరి చేలకూ నీళ్లు

- మధిర శాఖ కాల్వకు విడుదలైన సాగర్‌జలాలు
- రైతుల్లో నెలకొన్న ఆనందాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్ ఆయకట్టులో ఎండిపోతున్న పంటలకు నీటి తడులు అందించేందుకు శనివారం సాగర్‌జలాలు విడుదలయ్యాయి. ఇప్పటిదాకా సాగు చేసిన వరి, పత్తి, మిరప పంటలకు నెల రోజులుగా నీటి సరఫరా లేక ఎండుముఖం పట్టాయి. అక్కడక్కడా మడుగుల్లో నిల్వ ఉన్న కొద్దిపాటి నీటిని చమురు యంత్రాలతో తోడి దూరాభారమైనా భరిస్తూ వరికి నీటి తడి అందిస్తున్నారు. సెప్టెంబరు రెండో పక్షం నుంచి సాగునీటి కోసం ఆశగా ఎదురు చూస్తున్న కర్షకులకు శనివారం విడుదలైన సాగర్‌జలాలతో ఊపిరి పోసినట్లయింది.

సమస్యపై స్పందించారిలా..

ఈ ఏడాది ఖరీఫ్‌లో మధిర బ్రాంచి కెనాల్‌కు ఆగస్టు మూడో వారంలో మొదటిగా, సెప్టెంబరు 27న రెండోసారి సాగర్‌జలాలు విడుదలయ్యాయి. అయితే మధిర బ్రాంచి కెనాల్‌లో కల్లూరు సెక్షన్ పరిధిలోని 20వ కి.మీ లోపు పంటలకు మాత్రమే సరఫరా జరిగింది. 23వ కి.మీ దిగువన ఉన్న గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ పరిధిలోని మేజర్లకు చుక్కనీరు రాకుండా తెలంగాణ అధికారులు కట్టడి చేశారు. దీనిపై ఈ నెల 3న ఈనాడులో 'చివరికి అందని సాగర్‌జలాలు' శీర్షికతో కథనం ప్రచురితమవగా.. స్పందించిన ఎన్నెస్పీ తిరువూరు సబ్ డివిజన్ డీఈఈ కె.రామ్‌దాసు తెలంగాణ అధికారులతో మాట్లాడారు. గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో తక్షణమే సాగర్‌జలాలు సరఫరా చేయాల్సిన అవసరాన్ని వివరించారు. దీంతో శనివారం దిగువకు విడుదల చేశారు.


పైర్లకు పైపులు ద్వారా నీటి తడులు అందిస్తున్న రైతు



గంపలగూడెం సెక్షన్ పరిధిలోని నియంత్రిక వద్దకు చేరిన నీరు

మరో వారం రోజుల పాటు

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి శనివారం మధిర బ్రాంచి కెనాల్‌కు 954 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఏఈ మహేష్ తెలిపారు. మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 220 క్యూసెక్కులు చేరాయి. దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు 50, పెద్దకొమిర 30, నిదానపురం 10 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నారు. మరో వారం రోజుల వరకు సాగర్‌జలాలు సరఫరా ఉంటుందని డీఈ రామ్‌దాస్ న్యూస్‌టుడేకి తెలిపారు.

పంటలకు ఊపిరి పోశారు



మధిర శాఖ కాల్వ ఆయకట్టులో వరి, పత్తి, మిరప పంటలు పదెకరాల్లో సాగు చేశాను. నెల రోజులుగా సాగర్ జలాలు సరఫరా చేయలేదు. మండుతున్న ఎండలకు భూమిలో తేమ లేక పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. సాగు నీటి కొరతతో ఇక్కట్లు పడుతున్న తరుణంలో కాల్వకు నీళ్లు విడుదల చేసి పంటలకు ఊపిరి పోశారు.

- చెన్నా కృష్ణారావు, గాదెవారిగూడెం రైతు


గంపలగూడెం : తోటమూలలో మహిళల పూజలు


ఎ.కొండూరు : చీమలపాడు శ్రీరామమందిరంలో


విస్సన్నపేట : పుట్రేల మారెమ్మ గుడిలో


తిరువూరు ఎన్నెస్పీ కాలనీలో


గంపలగూడెం : గుళ్లపూడిలో


ఎ.కొండూరు : కంభంపాడు వాసవీ కల్యాణ మండపంలో


గంపలగూడెం : బతుకమ్మ సంబరాల్లో మహిళలు


మైలవరంలో..

అఖిలాండేశ్వరి.. అభయస్వరూపిణి

తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం జగన్మాత ప్రతిమలను భక్తులు అన్నపూర్ణాదేవిగా, ధైర్యలక్ష్మి, గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుంకుమ పూజల్లో అధిక సంఖ్యల్లో మహిళలు పాల్గొన్నారు. నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

- న్యూస్‌టుడే బృందం


మైలవరం : శాకంబరీ దేవిగా..


జి.కొండూరు బీసీ కాలనీలో..


ఇబ్రహీంపట్నంలో


ఇబ్రహీంపట్నంగ్రామీణం: కొటికలపూడిలో


ఎన్టీటీపీఎస్ అభయసాయి మందిరంలో


రెడ్డిగూడెం : అలివేలు మంగాపురంలో మహిళల పూజలు

డిసెంబరులో 'బిగ్ భారత్ క్రికెట్ లీగ్' టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఐపీఎల్ తరహాలో 'బిగ్ భారత్ క్రికెట్ లీగ్' (బీబీఎల్) క్రికెట్ టోర్నీని డిసెంబరులో విశాఖలో నిర్వహిస్తామని బీబీఎల్ వ్యవస్థాపకుడు చారుణ్య సాయి తెలిపారు. టోర్నీ లోగో, పోస్టర్‌ను శనివారం ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. లీగ్‌లో మొత్తం వంద జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు ఎంపీకి వివరించారు.

కళాశాల విద్యార్థులకు పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - 2047 కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా.ఇళ్లా రవి శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ జీవన ప్రమాణాలు మెరుగు పడడానికి అత్యంత ప్రధానమైన అంశాల గురించి విద్యార్థులు మాట్లాడారు. ఆర్థిక అభివృద్ధి, వైద్యం విద్యా రంగం, పారిశ్రామిక రంగంలో ప్రపంచంతో పోటీ పడగలిగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ ఇళ్లా రవి

చౌక బియ్యం పట్టివేత

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలో చౌక బియ్యం అక్రమ రవాణాపై నిఘా కొరవడడంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. గత అర్ధరాత్రి చెవుటూరు శివారు ప్రాంతంలో బొలెరో వాహనంలో తీసుకొచ్చిన బియ్యాన్ని డీసీఎం వ్యాన్‌లో ఎక్కిస్తున్నారని జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్‌కు సమాచారం అందింది. దీంతో ఎస్సై తన సిబ్బందితో అక్కడికి చేరుకొని రెండు వాహనాలను జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుమారు నాలుగున్నర టన్నుల ఉన్న ఈ చౌకబియ్యం వివరాలను పీడీఎస్ డీటీ మాధవిలతకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.


పోలీసుల అదుపులో బియ్యం వాహనాలు

'వైకాపా అభ్యర్థిని గెలిపించాలి'

విస్సన్నపేట: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో పట్టభద్రులతో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలని నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు పార్టీ నాయకులకు సూచించారు. విస్సన్నపేటలో శనివారం మండల పార్టీ నాయకులతో సమావేశమైన ఆయన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో వైకాపా అభ్యర్థి కోనూరు గౌతమరెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు. నాయకులు బి.లోకేశ్వరరెడ్డి, దుర్గారావు, కుటుంబరావు, రాణి, లక్ష్మయ్య, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌లతో నైపుణ్యాలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక డాక్టర్. ఎల్‌హెచ్‌హెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేస్తున్న ఇంటర్న్‌షిప్ గోగ్రామ్‌ను సమగ్రశిక్ష రాష్ట్ర ఇంటర్న్‌షిప్ అధికారులు దీపికారాణి, జీసీడీఓ శాంతిలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరుణ్ మోటార్స్ రమేష్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ వల్ల వర్కింగ్ స్కిల్స్ పెంచుకోవచ్చని, అవి ఉన్నత విద్యకు దోహదపడుతాయన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ ఎ.శ్యామ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

కొండపల్లి, న్యూస్‌టుడే: పీవీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమరాజు గుట్ట, వైఎస్ఆర్‌కాలనీలలోని వరద బాధితులకు ట్రస్ట్ ఛైర్మన్ పచ్చిగోళ్ల వెంకటరత్నం నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాజేష్, ప్రదీప్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కొండపల్లి, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్త ప్రసాదరావు అస్వస్థతకు గురై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాడని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్టుకు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ చేయూతనిచ్చారు. రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారని పార్టీ నాయకులు తెలిపారు.

శేషాచల శ్రీనివాసుడికి ప్రత్యేక అలంకరణ

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో శనివారం మూలవిరాట్‌ను అర్చకులు శ్యామ్‌సుందరాచార్యుల ఆధ్వర్యంలో వర్ణశోభితమైన పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పాలపొంగళ్లతో దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పంది వెంకట్రావు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయానికి రూ.50 వేల విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలుకు చెందిన ప్రవాసాంధ్రుడు యింజం నాగకృష్ణ ఆయన నాయినమ్మ భద్రమ్మ పేరుతో తిరుపతమ్మ ఆలయానికి శనివారం రూ.50 వేలు విరాళంగా అందించారు. నాగకృష్ణ తల్లి పద్మావతి చెక్కును ఆలయ ఈవో కిశోర్ కుమార్‌కు అందజేశారు. దాతలకు వేదపండితులతో ఆశీర్వచనాలు చేసి, ప్రసాదాలు అందజేశారు.

పేర్లు నమోదు చేసుకోండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ విజ్ఞప్తి చేసింది. శనివారం సూర్యారావుపేటలోని ఉప కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు, ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్. పరిధిలో లేని దుకాణాల్లో పనిచేసే కార్మికుల వివరాలను ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేశారు. సంక్షేమ బోర్డు.. ప్రసూతి సాయం, సహజ మరణం, ప్రమాద మరణం, అంగవైకల్య పరిహార పథకాలు అమలు చేస్తోంది. వీటిపై అవగాహన కలిగించారు. అర్హుల వివరాలను ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసి, గుర్తింపు కార్డులు అందించారు. సంక్షేమ బోర్డులో నమోదు చేసేందుకు అవసరమైన దరఖాస్తులను పలువురు కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు బి.కిషోర్‌కుమార్, పి.మహేశ్వరరెడ్డి, పి.శ్రీనివాసరావు, టి.రాజేష్, పి.రాంకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు ఢీ.. ఒకరి మృతి

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: ఎన్టీఆర్‌జిల్లా ఎ.కొండూరు మండలంలోని కంభంపాడు పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపిన వివరాల మేరకు..జిల్లాలోని కంచికచర్ల మండలం దొనబండకు చెందిన షేక్ అబ్దుల్‌రఫీ(40) ఒడిశాలోని ఒక క్రషర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తన బొలెరో వాహనంలో ఒడిశా నుంచి స్వస్థలమైన దొనబండ వస్తుండగా మధ్యాహ్నం గుంటూరు నుంచి తిరువూరుకు వెళుతున్న స్కార్పియో వాహనం ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో అబ్దుల్ రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి భార్య మహాభి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


పరస్పరం ఢీకొన్న కార్లు

స్పందనకు వందనం

❖ మూడో డివిజన్ కరెన్సీనగర్ గుత్తికొండ ధనుంజయరావు, డీవీ రావు వీధుల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి ప్రణీత్ ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు.

❖ నాలుగో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ 8వ రోడ్డు మొదట్లో విద్యుత్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి ద్వారకనాథ్ ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

❖ మూడో డివిజన్ కరెన్సీనగర్ కడియాల వెంకట కృష్ణారావు వీధిలో చెత్త కుప్పలు తొలగించాలని స్థానిక నివాసి కృష్ణార్జునరావు శానిటరీ అధికారి ఆంథోనీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చెత్త ఎత్తించారు.

❖ రెండో డివిజన్ మాచవరం యారాం వారి వీధి క్వారీలో సైడు కాలువలు పూడుకుపోయి మురుగునీరంతా రోడ్డుపైకి వచ్చిందని స్థానిక నివాసి రాకేష్ శానిటరీ అధికారి ద్రోణాచారికి ఫిరాదు చేశారు. ఆయన సిబ్బందితో పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

మూడో రోజు ఆదాయం రూ.45.43 లక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో మూడో రోజు శనివారం వివిధ సేవలు, దర్శనం టిక్కెట్లు, లడ్డూ టోకెన్ల ద్వారా రూ.45.43 లక్షల ఆదాయం వచ్చింది. రూ.500, రూ.300, రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.19,24,000. రూ.5,19,900, రూ.4,19,600 ఆదాయం వచ్చింది. లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12 లక్షలు, కేశఖండన టోకెన్ల ద్వారా రూ.83,120 ఆదాయం లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

విజయవాడ తూర్పు

నాసిరకం కిస్మిస్ తిప్పిపంపిన అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గగుడి స్టోర్సుకు గుత్తేదారు నాసిరకం కిస్మిస్ బాక్సులను పంపగా ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం తిప్పి పంపారు. దసరా ఉత్సవాల్లో లడ్డూ ప్రసాదం పెద్ద మొత్తంలో తయారు చేయాల్సి ఉంటుంది. మొదటి రోజు పెద్ద సైజులో కిస్మిస్ పంపిణీ చేసిన గుత్తేదారు మూడో రోజు సైజు తగ్గిపోవడాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. పది రోజుల వ్యవధిలో స్టోర్సుకు పంపిన సరకులను ఫుడ్ సేఫ్టీ అధికారులు మూడుసార్లు తిప్పిపంపారు.

మంత్రి ఆకస్మిక పర్యటన.. సౌకర్యాలపై ఆరా

కృష్ణలంక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకల్లో భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీసేందుకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా


వసతులు, సమస్యల గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పర్యటించారు. క్యూలైన్లలో మంచినీరు, తదితర సమస్యలపై భక్తులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దర్శనం జరుగుతున్న తీరు గురించి ఆరా తీశారు. సదుపాయాలు బాగున్నాయని, గతం కంటే మరింత మెరుగ్గా అమ్మవారి దర్శనం లభిస్తోందని భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు మూడు, నాలుగుసార్లు భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, వారు సూచించిన ప్రకారం అదనపు సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేయమని పదేపదే సూచిస్తున్న విషయాన్ని అధికారులకు మంత్రి గుర్తు చేశారు. ఉత్సవాలు జరిగే మిగిలిన రోజుల్లో మంచినీళ్లతో పాటు పాలు, మజ్జిగ పంపిణీ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అమ్మవారి దర్శనానికి ముందు కృష్ణా నదికి నిత్యం ఇస్తున్న నవ హారతుల్లో మంత్రి పాల్గొన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో కె.ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ పతకాల సాధన

సెపక్ తక్రాలో కేబీసీ జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

న్యూస్‌టుడే– విజయవాడ క్రీడలు



సెపక్ తక్రా అంటే వెంటనే గుర్తుకొచ్చేది పటమటలోని కేబీసీ జడ్పీ హైస్కూల్ పాఠశాల. వ్యాయామోపాధ్యాయుడు సింహాద్రి రమేష్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పోటీలకు పంపిస్తున్నారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులంతా ఈ పాఠశాలకు చెందిన వారే. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించగా.. ఇరు జట్లకు ఇదే పాఠశాలకు చెందిన వారు ఎంపికవడం గమనార్హం. తొమ్మిదో తరగతి చదువుతున్న ఆ విద్యార్థులంతా నిరంతర సాధన చేస్తూ ప్రతిభ చూపుతున్నారు.

పోలీస్ ఉద్యోగం సాధిస్తా

అమ్మ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూ ప్రోత్సాహంతో సెపక్ తక్రాలో అడుగు పెట్టా. నాన్నా ఖదీర్ లారీ మెకానిక్. రోజూ నాలుగున్నర గంటలు సాధన చేస్తున్నా. తొలి ఏడాదిలోనే అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో జిల్లా జట్టుకు ఆడాను. జూడో సాధన కూడా ప్రారంభించాను. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో కాంస్యం సాధించా. చదువులో 65 శాతానికిపైగా మార్కులు వస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొంది పోలీస్ అవుతా.
- మొహమ్మద్ జాకీర్

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



తండ్రి బంగారయ్య ప్రైవేటు ఉద్యోగి. అమ్మ శ్రీదేవి వంటమనిషి. రాజమహేంద్రవరం నుంచి 2022లో విజయవాడ వచ్చి కేబీసీ జడ్పీ హైస్కూల్‌లో చేరా. పీఈటీ ప్రోత్సాహంతో సెపక్ తక్రాపై దృష్టి సారించా. గత ఏడాది నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించడంలో కీలకంగా వ్యవహరించాను. ఫలితంగా రాష్ట్ర జట్టులో స్థానం లభించింది. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో ఆడాను. పాట్నాలో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర జట్టుకు ఆడి నాలుగో స్థానంలో నిలిచాం. అంతర్జాతీయ క్రీడాకారిణిగా రాణించి సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావడమే లక్ష్యం. - పైడిశెట్టి హరిప్రియ

అమ్మ కల నెరవేరుస్తా



అమ్మ పార్వతి కూలీ. నాన్న శంకరరావు తాపీ మేస్త్రి. గత ఏడాది మా స్కూల్‌లోనే నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలో జిల్లా జట్టుకు ఆడా. మా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆ ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్టులో స్థానం లభించింది. ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో తలపడి జట్టు ద్వితీయ స్థానం సాధించడానికి కృషి చేశాను. రోజూ సాధన చేస్తున్నా. చదువులో 65 శాతం మార్కులు వస్తాయి. క్రీడల్లో రాణించి పోలీస్ ఉద్యోగం సాధించి అమ్మ కల నెరవేర్చడమే లక్ష్యం. - ఊల కావ్య

తండ్రి స్ఫూర్తితో..



ఎలక్ట్రీషియన్‌గా పని చేసే నాన్న రవికుమార్ స్వతహాగా అథ్లెట్. ఆయన స్ఫూర్తితో సెపక్ తక్రా సాధన ప్రారంభించా. అమ్మ బాలభద్ర. సూపర్ మార్కెట్‌లో పని చేస్తారు. సాధన ప్రారంభించిన ఏడాదిలోనే అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా జట్టుకు ఆడాను. అప్పటి నుంచి జిల్లా జట్టులో స్థానం సాధిస్తూ ఎస్‌జీఎఫ్, రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఆడాను. గతేడాది కర్ణాటక రాష్ట్రం దావణగిరిలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించా. చదువులో 70 శాతం మార్కులు వస్తాయి. అంతర్జాతీయ స్థాయిలో రాణించి క్రీడా కోటాలో ఉద్యోగ సాధనే లక్ష్యం. - కొత్తపల్లి కుషాల్

సేవా కమిటీ అత్యుత్సాహం!

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దేవాదాయ శాఖ నియమించిన కమిటీలోని కొందరు సభ్యులు 'సేవను మరచి పెత్తనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. చేరిన రోజు నుంచే భక్తులు ఇబ్బందులపై కంటే తమ వారికి దర్శనాలు ఎలా చేసుకోవాలనే విషయంపై దేవస్థానం, పోలీసు సిబ్బందితో వివాదాలకు దిగుతున్నారు. క్యూలైన్లో గాలి సరిగా అందక భక్తులు సొమ్మసిల్లి పడిపోతున్నారు. కొన్ని పాయింట్ల వద్ద తాగేందుకు నీరు లభించడం లేదు. దివ్యాంగులు వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వాహనాలు అందుబాటులో ఉండటం లేదు. ఇలాంటి అంశాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన సేవా కమిటీ సభ్యులు కొందరు అధికారులు, సిబ్బందితో గొడవ పడుతున్నారు. వీరిలో కొందరు గతంలో వైకాపాలో పెత్తనం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా వీరు చేస్తున్న పనుల కారణంగా దేవాదాయ శాఖ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఉద్యోగులు వాపోతున్నారు. దేవస్థానం అధికారులను కలిసి సమస్యలు చెప్పేందుకు కూడా అవకాశం ఇవ్వడంలేదని కొంత మంది సభ్యులు వాపోతున్నారు.

వీవీపీలు నిర్దేశిత సమయాల్లో దర్శనానికి రావాలి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వీవీపీ పాసులు ఉన్నవారు నిర్దేశిత సమయాల్లో దర్శనానికి రావాలని కలెక్టర్ సృజన సూచించారు. ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్ వద్ద శనివారం ఆమె మాట్లాడారు. ఉదయం 8 నుంచి 10 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వీవీపీ పాసులు ఉన్నవారు ముందుగా స్లాట్ బుక్ చేసుకొని దర్శనానికి వస్తే సామాన్య భక్తులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. స్లాట్ సమయంలో వచ్చిన వారికి దేవస్థానం ఏర్పాట్లు చేస్తున్నారు. సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ నవరాత్రుల నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ నియంత్రిస్తామని, సామాన్య ప్రజలకు ఇబ్బందులు తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి పోలీసులకు మధ్య సమన్వయ లోపం లేకుండా సరిచేస్తామన్నారు. ఈవో రామారావు పాల్గొన్నారు.

11 ప్రాంతాల్లో లడ్డు విక్రయాలు

భవానీపురం: అమ్మవారి లడ్డు ప్రసాదం అంటే ప్రతి ఒక్కరికీ ప్రీతిపాత్రమే. దసరా నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కనకదుర్గానగర్ వద్ద 11 కౌంటర్లు ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ కౌంటర్ల ద్వారా లడ్డు విక్రయాలు చేస్తున్నారు.

ద్వారకా తిరుమల సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, సారెను శనివారం సమర్పించారు. ఆలయ ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

దుర్గమ్మ భక్తులకు జలుబు.. దగ్గు!

కృష్ణలంక, న్యూస్‌టుడే

దసరా వేడుకల్లో భాగంగా దుర్గమ్మను దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల్లో అధికులు జలుబు, దగ్గు, నొప్పులు, నీరసంతో బాధ పడుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. కృష్ణవేణి ఘాట్ వద్ద జిల్లా వైద్య విభాగం ఆధ్వ


భక్తురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అక్కడికి వైద్యం నిమిత్తం వస్తున్న భక్తుల్లో ఎక్కువమంది అవే కారణాలు చెబుతూ వైద్య సహాయం కోరుతున్నారని సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణంలో మార్పులు, తీవ్రమైన ఎండ వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు తెలిపారు. వైద్య సేవల నిమిత్తం వస్తున్న భక్తులను పరీక్షించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

నాయీ బ్రాహ్మణుల్లో నైరాశ్యం

దేవస్థానం కృష్ణవేణి ఘాట్ సమీపంలో కేశఖండన శాల ఏర్పాటు చేసింది. ఇక్కడ విధుల నిమిత్తం శ్రీశైలం, ద్వారకాతిరుమల, అన్నవరం, పెనుగంచిప్రోలు.. తదితర క్షేత్రాలతో పాటు పత్రికా ప్రకటన ఇచ్చి సుమారు 270 మంది నాయీబ్రాహ్మణులను విధుల నిమిత్తం తీసుకొచ్చారు. వారందరికీ విడతల వారీగా సమాన ప్రాతిపదికన టిక్కెట్లను అధికారులు అందజేస్తున్నారు. మూడు రోజుల్లో భక్తుల సంఖ్య తక్కువగా ఉండటంతో కొందరు నిరాశ చెందుతున్నారు. ఇప్పటివరకు రోజుకు ఒక్కొక్కరికీ నాలుగైదు టిక్కెట్లు మాత్రమే దక్కుతుండటంతో నిరాశ నెలకొంటోంది. రానున్న రోజుల్లో భక్తుల సంఖ్య పెరిగితే తప్పించి తమకు ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ స్కేటర్ ఆర్యాణికి అభినందన

విజయవాడ క్రీడలు: నగరానికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ చేబోయిన ఆర్యాణిని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి శనివారం నగరంలోని ఆయన విడిది కార్యాలయంలో అభినందించారు. ఇటీవల ఇటలీలో జరిగిన వరల్డ్ స్కేట్ గేమ్స్-2024లో రోలర్ డెర్బీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఆర్యాణి అభిరుచి తెలుసుకొని ఆ రంగంలో ప్రోత్సహించడమే కాకుండా శిక్షణ ఇచ్చిన తండ్రి శివపరమేశ్వరరావు, తల్లి నాగస్వర్ణను అభినందించారు. ఆర్యాణి కాంస్య పతకం సొంతం చేసుకున్న విషయం తెలుసుకొని మంత్రి తమ కార్యాలయానికి ఆహ్వానించారు.


ఆర్యాణితో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, పక్కన ఆమె తల్లిదండ్రులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీఏ అధ్యక్షుడు శివనాథ్, నిర్వాహకులు

మెయిన్ డ్రాకు క్రీడాకారుల అర్హత

విజయవాడ క్రీడలు: నగరంలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియం, ఎస్ఎస్‌బీఏ ఇండోర్ స్టేడియాల్లో జరుగుతున్న ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో శనివారం అండర్-15, 17 కేటగిరీ బాలికల డబుల్స్, మిక్స్‌డ్‌లో పలువురు క్రీడాకారులు మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. శనివారం జరిగిన బాలికల డబుల్స్, మిక్స్‌డ్ క్వాలిఫైయింగ్ రౌండ్ తుది పోరులో షట్లర్లు హోరాహోరీగా తలపడ్డారు. అండర్-15 బాలికల డబుల్స్‌లో రాష్ట్రానికి చెందిన డి.విజయ తేజస్విని, ఐ.తన్వీ, ఎం.దీవెన రాణి, ఎం.భవిత, డి.తేజస్విని, త్రిషిత దీప్తి, శ్రీశ్లోక కాటంరెడ్డి, అండర్-17 బాలికల డబుల్స్‌లో ఎస్.నక్షత్ర జోడీ మెయిన్ డ్రాకు అర్హత సాధించాయి. మిక్స్‌డ్ అండర్-15లో టి.వర్షిత్-జి.వెంకట లతారెడ్డి, ఎ.మానస్, పవన్ అంగడ్ రాజ్-కె.వర్షశ్రీ, జి.సాయి వేదవ్యాస్ వర్మ-డి.తేజస్విని, అండర్-17లో కె.గగన శ్రీచౌదరి, షహీర్ షేక్, ఎం.లక్ష్మీప్రియ జోడీ, కె.శ్రీకర్ వెంకట ప్రణీత్ మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. వారంతా ఈ నెల 8 నుంచి జరిగే మెయిన్ డ్రా పోటీలో తలపడతారని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు.

డిసెంబరులో 'బిగ్ భారత్ క్రికెట్ లీగ్' టోర్నీ

విజయవాడ క్రీడలు: ఐపీఎల్ తరహాలో 'బిగ్ భారత్ క్రికెట్ లీగ్' (బీబీఎల్) క్రికెట్ టోర్నీని డిసెంబరులో విశాఖలో నిర్వహిస్తామని బీబీఎల్ వ్యవస్థాపకుడు చారుణ్య సాయి తెలిపారు. టోర్నీ లోగో, పోస్టర్‌ను శనివారం ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. లీగ్‌లో మొత్తం వంద జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు ఎంపీకి వివరించారు. బీబీఎల్ సహ వ్యవస్థాపకులు భరణి, చైతన్య, జశ్వంత్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నిస్సాన్ మాగ్నైట్ కారు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సరికొత్త నిస్సాన్ 2024 వెర్షన్ మాగ్నైట్ కారును నగరంలోని ఎక్స్‌ప్రెస్ నిస్సాన్ షోరూమ్‌లో శనివారం ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ పాములపాటి సుధీర్ మాట్లాడుతూ.. . విసియా, విసియా ప్లస్, యాసెంటా, ఎన్‌కనెక్టా, టెక్నా, టక్నా ప్లస్ వేరియంట్లలో అందరికీ అందుబాటు ధరల్లో కార్లు లభిస్తున్నాయని తెలిపారు. అనేక రకాల కొత్త, భద్రత ఫీచర్లు ఉన్నాయని వివరించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సుబ్బారావు, ఏజీఎం రామకృష్ణ, నిస్సాన్ ఏరియా సర్వీస్ మేనేజర్ కోటేశ్వరరావు, షోరూమ్ జనరల్ మేనేజర్ సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




కారు ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం సుబ్బారావు, రామకృష్ణ, షోరూమ్ ఎండీ సుధీర్ తదితరులు



సీతమ్మవారిపాదాల సెంటర్‌లో ఉన్న శనైశ్చర ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని లోకక్షేమాన్ని కాంక్షిస్తూ శనివారం నవగ్రహ హోమాన్ని నిర్వహించారు. ప్రధానార్చకుడు తూటుపల్లి శ్రీమన్నారాయణ హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – కృష్ణలంక, న్యూస్‌టుడే

సీఎం సహాయనిధికి విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పటమట సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు

పటమట, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సీఎం సహాయనిధికి రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, సభ్యులు కోనేరు వెంకటేశ్వరరావు, వి.శివశంకరరావు, ఎల్.నాగేశ్వరరావు, డి.సూర్యనారాయణ శనివారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు.

ఆకట్టుకుంటున్న ప్రదర్శన


స్టాల్స్ వద్ద సందర్శకులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పండగలు, వివాహాల సందర్భంగా ఎంజీ రోడ్డు బృందావన కాలనీలోని ఎ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే రఫెల్స్ ప్రదర్శనను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మంజు మాట్లాడుతూ.. డిజైనర్ వేర్, క్లోతింగ్ మెటీరియల్, చీరలు, ఫ్యాషన్ యాక్సెసరీస్, జ్యూయలరీ, ఒకగ్రాము జ్యూయలరీతో పాటు వివిధ ఉత్పత్తులను స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళల కోసమే ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు మాత్రమే ప్రదర్శన ఉంటుందని, నగర ప్రజలు సందర్శించాలని కోరారు.

ఉచితంగా వినికిడి పరికరాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : వినికిడి లోపాలు ఉన్న వారిని గుర్తించి, దీన్‌దయాళ్ శ్రావణ్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా పరికరాలు అందజేస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. శనివారం పాత ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లోపం ఉన్న 59 మందిని గుర్తించినట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా ఉంటే.. ఈ నెల 30న ఆస్పత్రి ప్రాంగణంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. డాక్టర్ జి.మాధవీనాయుడు, జె.రవితేజ, కీర్తిప్రసన్న, భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

చూసేవారు లేక.. బతుకు బండి లాగలేక..

కుమారుడికి పురుగుల మందు తాగించిన తండ్రి ● అనంతరం తానూ బలవన్మరణం

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే

జీవితాంతం తోడుంటుందనుకున్న భార్య.. ఏళ్ల క్రితమే కాలం చేసింది. చేతికొచ్చిన కుమారుడైనా చేదోడువాదోడుగా ఉంటాడనుకుంటే.. అనారోగ్యం పాలయ్యాడు. బిడ్డను సాకడానికి ఉద్యోగం వదిలేశారు. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. బతుకు భారమైంది. ఆదరించేవారే లేకపోయారు. మరోవైపు వృద్ధాప్య బాధలు. వీటిని భరించలేని ఓ తండ్రి.. కుమారుడికి పురుగుల మందు తాగించారు. అనంతరం తానూ తాగి బలవ్మనరణం పొందిన హృదయవిదారక ఘటన విజయవాడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ కృష్ణలంకకు చెందిన బొర్రా ప్రసాద్ (65) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. 2012లో ఈయన భార్య అనారోగ్యంతో మృతి చెందారు. కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు శివకుమార్ (32)కు


మృతి చెందిన ప్రసాద్


చికిత్స పొందుతున్న శివకుమార్

అయిదు సంవత్సరాల క్రితమే పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి అతను మంచానికే పరిమితమయ్యారు. కుమారుడిని చూసే వారు లేకపోవడంతో ప్రసాద్.. ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉండిపోయారు. ప్రస్తుతం గుణదల ఊర్మిళానగర్‌లో ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛనుతో బతుకుతున్నారు. ఉద్యోగం లేకపోవడం, పింఛను సరిపోకపోవడంతో బంధువుల వద్ద డబ్బులు తీసుకుంటూ.. జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో.. తన చిన్న అత్తకు ఫోన్ చేశారు. తనకు డబ్బులు కావాలని, పంపకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. ఆమె.. ప్రసాద్ అల్లుడైన అట్లూరి దేవేందర్ ప్రసాద్‌కు ఫోన్ చేశారు. ఆయన శనివారం ఉదయం గుణదలలోని ఇంటికి వచ్చి చూశారు. అప్పటికే బొర్రా ప్రసాద్ చనిపోయాడు. మంచంలో ఉన్న శివకుమార్ కొన ఊపిరితో ఉన్నాడు. చికిత్స నిమిత్తం అతడిని హుటాహుటీన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

క్రికెట్ పోటీలు ప్రారంభం

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో శనివారం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. చందాపురం బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోటీల్లో ఆమె క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒత్తిడిని జయించడానికి ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.25,116ను అనుమోలు కిషోర్, రెండో బహుమతిని రూ.16,116ను వైఎస్.బాబు, తృతీయ బహుమతిని రూ.12,116ను మండవ కృష్ణకుమారి, శ్రీనివాసరావు, నాలుగో బహుమతిని రూ.9,116ను శ్రీవైష్ణవి కమ్యూనికేషన్స్ యజమాని, ట్రోఫీ, దుస్తులను మహేంద్ర స్వర, కేఎంఆర్ ఆసుపత్రి, బంతులను ఆదినారాయణ, రామ్మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని చెప్పారు. కూటమి నాయకులు రాము, లక్ష్మీనారాయణ, వడ్డెల్లి సాంబశివరావు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న మహిళలతో కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్

మహిళలకు కుట్టు శిక్షణ పూర్తి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ సుజనా ఫౌండేషన్ కార్యాలయంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న అయిదో బ్యాచ్ 20 మంది మహిళలకు శనివారం కోఆర్డినేటర్ కొంగర దుర్గాప్రసాద్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దసరా తరువాత ఆరో బ్యాచ్ మహిళలకు కుట్టుశిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. వివరాలకు 738215066 నెంబరులో సంప్రదించాలని సూచించారు. టీచర్లు కోమలి, విరజ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

❖ చందర్లపాడులోని పడమట బజారు, ధర్మ చెరువు, బీసీ కాలనీల్లో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదని పంచాయతీ కార్యదర్శి సాయిరాం దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపించి దీపాలు ఏర్పాటు చేయించారు.

❖ చందర్లపాడులోని దమ్మాలపాటి వారి బజారు, తూర్పు బజారు, ధర్మ చెరువులోని కాల్వల్లో మురుగు పేరుకుపోయిందని పంచాయతీ కార్యదర్శికి తెలుపగా పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, చందర్లపాడు

❖ పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం వద్ద తాగునీటి ఇబ్బందులపై 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆలయ ఏఈ రాజు, సిబ్బంది స్పందించి పైపులైన్ నిర్మాణం చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

❖ శివాపురంలో తాగునీటి పథకం మోటారు మరమ్మతులకు గురయి నీటి సరఫరా నిలిచిపోయింది. దీనిపై ఈనాడు మేమున్నాం మీకు తోడుగా ద్వారా సర్పంచి తేళ్ల లక్ష్మణరావు దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఆయన వెంటనే కొత్త మోటారు కొనుగోలు చేసి నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

❖ పెనుగంచిప్రోలు వడ్డెరపల్లిలో డ్రెయిన్‌లు పూడిక తీయాలని స్థానికులు సర్పంచి పద్మకుమారి దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు.

– పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

❖ శాంతినగర్‌లోని వీధిలో కంపచెట్లు పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా ఫిర్యాదు చేయడంతో పురపాలకసంఘం కమిషనర్ స్పందించారు. కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, నాయకులు కృష్ణ కంపచెట్లు తొలగించి సమస్యను పరిష్కరించారు.

? పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో ప్రధాన రహదారిపై వారం రోజులుగా పైపులైన్ పగిలి దుకాణాల ముందు బురద ఏర్పడుతోంది. – వ్యాపారి రమేష్

✔ పరిశీలించి తగిన చర్యలు తీసకుంటాం.

– ఏఈ హనుమంతరావు, – న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

ఆలయానికి రూ.50 వేల విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలుకు చెందిన ప్రవాసాంధ్రుడు యింజం నాగకృష్ణ ఆయన నాయినమ్మ భద్రమ్మ పేరుతో తిరుపతమ్మ ఆలయానికి శనివారం రూ.50 వేలు విరాళంగా అందించారు. నాగకృష్ణ తల్లి పద్మావతి చెక్కును ఆలయ ఈవో కిశోర్‌కుమార్‌కు అందజేశారు. దాతలకు వేదపండితులతో ఆశీర్వచనాలు చేసి, ప్రసాదాలు అందజేశారు.

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి గుంటూరు నగరం సాయినగర్ కాలనీకి చెందిన వడ్డంపుడి శివరామరాజు, లక్ష్మీనరసమ్మ దంపతులు శనివారం రూ.20 వేలు విరాళంగా అందజేశారు. దాతలను అమ్మవారి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి శనివారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన తురకా రాంబాబు కుమార్తె చదువు నిమిత్తం రూ.5వేలు వితరణగా అందించారు.

మంగళసూత్రం బహూకరణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని దుర్గాపురం దుర్గామల్లేశ్వరాలయంలోని దుర్గామాతకు కోమటి సురేష్, ఝాన్సీ దంపతులు పట్టువస్త్రాలతో పాటు రూ.10వేలు విలువైన మంగళసూత్రాన్ని సమర్పించారు.

వంతెనలు లేక.. రాకపోకలకు అవస్థ

చందర్లపాడు, న్యూస్‌టుడే

వాగులపై నిర్మించిన లోలెవల్ చప్టాల వల్ల వర్షాల సమయంలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోడ్డు ఎత్తుకన్నా చప్టాలు దిగువన ఉన్నాయి. భారీ వర్షాలు పడి, వాగులు పొంగినపుడు చప్టాలపైకి నీరు చేరుతోంది. ఫలితంగా తరచూ రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో చందర్లపాడు - పాటెంపాడు, పాటెంపాడు - వెలదికొత్తపాలెం, వెలదికొత్తపాలెం - పున్నవల్లి, చందర్లపాడు - పొక్కునూరు, చందర్లపాడు - ఉస్తేపల్లి, చందర్లపాడు - బొబ్బెళ్లపాడు, ముప్పాళ్ల - చందాపురం, విభరింతలపాడు - ఏటూరు రహదారుల మధ్య వాగులు ఉన్నాయి. ముప్పాళ్ల నుంచి ఏటూరు మధ్య నాలుగు వాగులు ప్రవహిస్తున్నాయి. చప్టాల బదులు వంతెనలు నిర్మించాలని కొన్నేళ్లుగా ప్రజలు కోరుతున్నా.. కార్యరూపం దాల్చడం లేదు.

పాలకులు దృష్టి సారిస్తేనే..

వాగుల్లో పూడిక ఏర్పడి ప్రవాహ సమయంలో చప్టాలపై నుంచి వరద ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులపైన ప్రయాణించడానికి ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముప్పాళ్ల వద్ద వాగు ఉద్ధృతంగా ప్రవహించింది. ద్విచక్ర వాహనంపై వాగు దాటడానికి ప్రయత్నించిన ప్రయాణికుడు ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమీప గ్రామస్థులు స్పందించి అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రాత్రి సమయంలో నీటి ప్రవాహంలో వాగుపై ప్రయాణిస్తే ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశం ఉంది. చప్టాల స్థానంలో వంతెనల నిర్మాణానికి అధికారులు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపేలా పాలకులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఏటా ఇబ్బందులు తప్పవని అంటున్నారు.



పాటెంపాడు, వెలదికొత్తపాలెంల మధ్య వాగుపై నిర్మించిన చప్టా

తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

నందిగామ గ్రామీణం: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపీనాయక్ శనివారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. డీఈవో, ఆర్ఐ తనిఖీలు నిర్వహించి తరగతులు నిర్వహించే విద్యాసంస్థల గుర్తింపును రద్దుచేయాలని కోరారు.

మంచిదే అంతిమ విజయం

కంచికచర్ల, న్యూస్‌టుడే: చెడుపై మంచిదే అంతిమ విజయమని, దానికి ప్రతీకగానే మనం విజయ దశమి నిర్వహించుకుంటామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ఆయుధ పూజకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. దుష్ట శక్తుల నుంచి ప్రజలను కాపాడే అమ్మవారిలానే పోలీసు వ్యవస్థ కూడా ప్రజలను రక్షించాలన్నారు. సీఐ చవాన్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

కంచికచర్ల, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల తెదేపా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ఆమె మాట్లాడారు. గత వైకాపా పాలనలో ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక సతమతమయ్యేవారని అన్నారు. రాష్ట్రంలో ప్రతిఒక్కరు తమ సమస్యను ప్రజాప్రతినిధులకు తెలిసేలా ప్రజా దర్బారు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులతో చర్చించి పరిష్కరించాలని సూచించారు. తెదేపా నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజా దర్బారులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

సీఎంఆర్ఎఫ్ సహాయం అందజేత

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న రామిశెట్టి వెంకటకృష్ణ వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.5లక్షల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య శనివారం ప్రజా దర్బార్ సభలో అందజేశారు. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన ఈయనకు డయాలసిస్ చేయించుకుంటున్న నేపథ్యంలో మెరుగైన వైద్యానికి కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్య చేసిన సిఫార్సుతో పంపిన ప్రతిపాదన మేర ముందస్తుగా ఈ మొత్తం మంజూరైంది. నరసింహారావు, సైదా, సత్యనారాయణ ప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య



శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు శ్రీనివాసులు, మోసెస్ వెస్లీ

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని వెంగనాయకునిపాలెంలో శనివారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించి 65 పశువులకు వైద్యసేవలు అందించినట్లు మండల వైద్యాధికారి అనిల్ తెలిపారు. శిబిరంలో పశువైద్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు, నందిగామ డివిజన్ అదనపు సంచాలకులు మోసెస్ వెస్లీ పాల్గొని పశుపోషకులకు అవగాహన కల్పించారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు కృష్ణమూర్తి, వెంగళరావు, ప్రభు, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం, దుప్పట్ల పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో శనివారం 140 పేద కుటుంబాలకు నందిగామ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ, డూలాస్ ట్రస్ట్ సౌజన్యంతో బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ పగిడిపల్లి దేవసహాయం, పి.జ్ఞానవరకుమార్, మృత్యుంజయరావు, సురేష్, స్థానిక ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షా ఉన్నారు.



కిట్లతో దాత దేవసహాయం, జ్ఞానవరకుమార్

సచివాలయంలో కంప్యూటర్ల ధ్వంసం

వేములపల్లి(కంచికచర్ల), న్యూస్‌టుడే : వేములపల్లి గ్రామ సచివాలయంలో ఉన్న కంప్యూటర్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం ధ్వంసం చేశారు. కార్యాలయం పని వేళలు ముగిసిన తరువాత ఉద్యోగులు ఇంటికి వెళ్లాక ఈ సంఘటన జరిగింది. సచివాలయం తలుపులు తెరిచి ఉండడం గమనించిన స్థానికులు లోపలికి వెళ్లి పరిశీలించగా, కంప్యూటర్లు కింద పడేసి, వైర్లు మొత్తం పీకేసి ఉన్నాయి. కంప్యూటర్లు ధ్వంసమైన విషయాన్ని గ్రామస్థులు అధికారులకు సమాచారం అందించారు. ఫిర్యాదు అందిన తరువాత చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



విరిగిన మోనిటర్

క్రీడా పోటీల్లో ప్రతిభ

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన 9వ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పరిటాల శివారు అమ్రిత సాయి ఇంజినీరింగ్ విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో భాగంగా నిర్వహించిన కానో పోలో ఛాంపియన్‌షిప్‌లో కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థి కె.విష్ణు ఆంధ్రప్రదేశ్ తరపున జూనియర్స్ విభాగంలో వెండి పతకం, సీనియర్స్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. విజయవాడలో నిర్వహించిన జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ అండర్-19 డబుల్స్ విభాగంలో కళాశాలకు చెందిన రెండో సంవత్సరం విద్యార్థి ఇర్ఫాన్ పాషా రెండో స్థానం కైవసం చేసుకున్నాడని కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, ప్రిన్సిపల్ ఎం.శశిధర్ తదితరులు అభినందించారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఎమ్మెల్యే పరామర్శ

నందిగామ, న్యూస్‌టుడే: వీరులపాడు మండలం వెల్లంకికి చెందిన ధన్వంత్, ఫణికుమార్ ఈనెల 4న రహదారి ప్రమాదంలో మృతి చెందగా శనివారం వారి మృతదేహాలను నందిగామ మార్చురీకి తరలించారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

శాసనసభ్యురాలిని కలిసిన ఆర్డీవో

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ నూతన ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన కె.బాలకృష్ణ శనివారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆమెతో చర్చించారు.

పురుషోత్తంరెడ్డికి నివాళి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి జనసేన నాయకుడు సామినేని ఉదయభాను దంపతులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. చారుగుండ్ల కొండా తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట: వాగ్దేవి కళాశాల వద్ద..



జగ్గయ్యపేట: ముత్యాలమ్మ గుడి వద్ద..



పెనుగంచిప్రోలు: ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు



పెనుగంచిప్రోలు డౌన్‌సెంటర్‌లో ..

అన్నపూర్ణేశ్వరి.. అఖిలాండేశ్వరి



చందాపురంలో..

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రుల్లో శనివారం మూడోరోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పెనుగంచిప్రోలు: మండలంలోని పలు మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు.

జగ్గయ్యపేట: జగ్గయ్యపేటలోని బతుకమ్మ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో జరిగే సామూహిక వేడుకను మహిళలు ముత్యాలమ్మ గుడి వద్ద నిర్వహించారు.

నందిగామ గ్రామీణం: మండలంలోని చందాపురం ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం అమ్మవారిని కూరగాయలతో కాశీఅన్నపూర్ణేశ్వరిగా అలంకరణ చేశారు. మహిళలు కుంకుమార్చనలు చేసి బతుకమ్మలాడారు.

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు వారాల పాటు నిర్వహించే వ్రతాలను శనివారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు పరాంకుశం సీతాచార్యుల పర్యవేక్షణలో మహిళలు వ్రతాలు చేశారు. మహిళలు పాల్గొన్నారు.



అంబారుపేటలో ..



జగ్గయ్యపేట: కనకదుర్గాలయం వద్ద చండీ హోమం



పెనుగంచిప్రోలు : బతుకమ్మలతో మహిళలు



కంచికచర్లలో..



నందిగామ శివాలయంలో ..

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన వీక్షణ



వీక్షిస్తున్న కృష్ణంరాజు, రైతులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: డా. కేఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడులో శనివారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 18వ విడత నిధులు విడుదల చేస్తున్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.ఎస్ కృష్ణంరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డా. రాజశేఖర్, కే.వి.కే శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం



ధన్వంత్, ఫణి కుమార్ (పాత చిత్రాలు)

వీరులపాడు, న్యూస్‌టుడే : మృత్యువులోనూ స్నేహ బంధం వీడలేదు. గ్రామంలో ఇద్దరూ కలసి మెలిసి ఉండేవారు. సరదాగా తిరిగేవారు. ఆ ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కంచికచర్ల మండలం పరిటాల వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనలో వీరులపాడు మండలం వెల్లంకి గ్రామానికి చెందిన వేల్పూరి ధన్వంత్(19) దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. ఇద్దరూ స్నేహితులు. మరో స్నేహితుడితో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెల్లంకి నుంచి ఈ నెల 4న పరిటాల వెళ్లి తిరిగి వస్తూ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ధన్వంత్ మృతి చెందగా, అచ్చి ఫణి కుమార్(19) శనివారం తెల్లవారుజామున కన్నుమూశాడు. ఇమ్రాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

అందివచ్చిన కుమారులు.. : వేల్పూరి రామాచారి దంపతులకు ఇద్దరు సంతానం. అందులో ధన్వంత్ చిన్నవాడు. ఓ కూతురు ఉంది. ధన్వంత్ బెంగళూరులో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 10వ తేదీ నుంచి దసరా సెలవులు ఉన్నప్పటికీ... కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడిపేందుకు వారం ముందుగానే ఇంటికి వచ్చాడు. రామాచారి బ్యాంకు ఉద్యోగి. కొడుకు చదువుకొని తమకు అండగా ఉంటాడనుకున్న సమయంలో తమకు తీరని శోకం మిగిల్చాడని తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

☛ అచ్చి వీరాంజనేయులుకు ఇద్దరు సంతానం. వివాహమైన కుమార్తె ఉంది. ఫణి కుమార్ చిన్నవాడు. ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. వచ్చే సంవత్సరం ఇంజినీరింగ్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. తండ్రి గొర్రెల పెంపకమే జీవనాధారం. చేతికందిన కొడుకు తమను వదిలేసి వెళ్లిపోయాడని తల్లిదండ్రులు రోదిస్తున్నారు. నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పరీక్ష అనంతరం ఇద్దరి మృతదేహాలను స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

గుంటూరులో విద్యార్థినిపై అత్యాచారం

పోలీసునంటూ బెదిరించిన దుండగుడు

గుంటూరు నేరవార్తలు: పోలీసునంటూ బెదిరించి దుండగుడు విద్యార్థినిపై అత్యాచారం చేశాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఓ విద్యార్థిని గుంటూరు నగరంలోని ప్రైవేట్ వసతిగృహంలో ఉంటూ సమీపంలోని ఓ కళాశాలలో బీ-ఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రాంలో పాతగుంటూరుకు చెందిన బార్బర్‌షాపులో పనిచేసే ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. క్రమేణా వారి మధ్య సాన్నిహిత్యం పెరగడంతో కొద్ది రోజుల నుంచి నెహ్రూనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఈక్రమంలో ఈ నెల 4వ తేదీ (శుక్రవారం) వేకువజాము 3 గంటల ప్రాంతంలో వారిద్దరూ ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీ తాగి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. కొత్తపేట బోసుబొమ్మ కూడలి వద్ద ఓ వ్యక్తి వారిని ఆపి తాను పోలీసునని చెప్పాడు. ఈ సమయంలో ఇద్దరు ఎక్కడ నుంచి వస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకొని అర్ధరాత్రుళ్లు తిరగకూడదన్నాడు. వాళ్లు చెబుతున్న విషయాలు నిజమా? కాదా? అని విచారించి నిర్ధారించుకుంటానని చెప్పాడు. వాళ్లు ఉంటున్న ఇల్లు చూపించమని, ఆ యువతిని అక్కడ తానే దించుతానని చెప్పి ఆగంతుకుడు తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. వాళ్ల వెనక వస్తున్న యువకుడి ద్విచక్ర వాహనం పెట్రోలు అయిపోవడంతో ఆగిపోయింది. అదే సమయంలో యువతిని బుచ్చయ్యతోటవైపు తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో అత్యాచారానికి పాల్పడి బెదిరించి వెళ్లిపోయాడు. కొత్తపేట సీఐ వీరయ్య మాట్లాడుతూ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు శనివారం ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వాహనాలు ఢీ.. ఒకరి మృతి

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: ఎన్టీఆర్‌జిల్లా ఎ.కొండూరు మండలంలోని కంభంపాడు పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపిన వివరాల మేరకు..జిల్లాలోని కంచికచర్ల మండలం దొనబండకు చెందిన షేక్ అబ్దుల్‌రఫీ(40) ఒడిశాలోని ఒక క్రషర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తన బొలెరో వాహనంలో ఒడిశా నుంచి స్వస్థలమైన దొనబండ వస్తుండగా మధ్యాహ్నం గుంటూరు నుంచి తిరువూరుకు వెళుతున్న స్కార్పియో వాహనం ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో అబ్దుల్ రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి భార్య మహబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విజయవాడ పశ్చిమ

వీఐపీలు నిర్దేశిత సమయాల్లో దర్శనానికి రావాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, పక్కన సీపీ రాజశేఖర్‌బాబు, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వీఐపీ పాసులు ఉన్నవారు నిర్దేశిత సమయాల్లో దర్శనానికి రావాలని కలెక్టర్ సృజన సూచించారు. ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్ వద్ద శనివారం ఆమె మాట్లాడారు. ఉదయం 8 నుంచి 10 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వీఐపీ పాసులు ఉన్నవారు ముందుగా స్లాట్ బుక్ చేసుకొని దర్శనానికి వస్తే సామాన్య భక్తులు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. స్లాట్ సమయంలో వచ్చిన వారికి దేవస్థానం ఏర్పాట్లు చేస్తుందన్నారు. సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ నవరాత్రుల నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ నియంత్రించామని, సామాన్య ప్రజలకు ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి పోలీసులకు మధ్య సమన్వయ లోపం లేకుండా సరిచేస్తామన్నారు. ఈవో రామారావు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, సారెను శనివారం సమర్పించారు. ఆలయ ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.


సారె తీసుకువస్తున్న ద్వారకా తిరుమల దేవస్థానం అధికారులు, అర్చక బృందం

అన్నప్రసాదం.. సంతృప్తికరం

చిట్టినగర్, న్యూస్‌టుడే

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని భక్తులు భావిస్తారు. దుర్గమ్మను కొలిస్తే చాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే దేవీశరన్నవరాత్రుల మహోత్సవాల్లో రోజుకో అలంకారంలో ఉన్న జగన్మాతను భక్తులు దర్శించుకొని అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. గతం కంటే మిన్నగా ఏర్పాట్లు ఉన్నాయని అన్నప్రసాదం బాగుందని భక్తులు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో ఇలా పంచుకున్నారు.


భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

క్రమపద్ధతిలో బాగుంది



మేం అమరావతి నుంచి దర్శనానికి వచ్చాం. అన్నపూర్ణాదేవిగా అమ్మను దర్శించుకుని కొండ దిగగానే అన్నప్రసాదం కేంద్రంలోకి వెళ్లాం. అన్నప్రసాదం స్వీకరించాం. చాలా బాగుంది. చక్కగా ఒక క్రమపద్ధతిలో తోపులాటలు లేకుండా వడ్డన చేశారు. ప్రసాదం దొరకడం మా అదృష్టంగా భావిస్తున్నాం. **- లేఖ్యశ్రీ, లలిత, అమరావతి**

గతం కంటే మిన్నగా..



అన్నపూర్ణాదేవిని మనసారా కొలిస్తే అన్నపానీయాలకు కొదవ ఉండదని, అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. ఆ తల్లి దయ, కరుణ ఉండేందుకు నిత్యం కొలిస్తే ఎలాంటి లోటు ఉండదని చెబుతారు. అందుకే దసరా ఉత్సవాల్లో అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకోవాలని డోన్ ప్రాంతం నుంచి కుటుంబాల సమేతంగా ఇంద్రకీలాద్రికి వచ్చాం. క్యూ మార్గంలో కొండకు చేరుకుని అన్నపూర్ణేశ్వరీని తనివితీరా వీక్షించాం. అమ్మ అందించిన అన్నప్రసాదం స్వీకరించాం. గతం కంటే చాలా బాగుంది. చాలా తృప్తిగా అనిపించింది. **- ఆచారి బాలు, రాజశేఖర్, డోన్**

రుచికరం..



కృష్ణలంక నుంచి వచ్చి అన్నపూర్ణాదేవిని దర్శించుకున్నాం. అధిక సంఖ్యలో భక్తులు ఉన్నా, ఆలస్యమైనా అన్నప్రసాదం స్వీకరించిన అనంతరమే ఇంటికి వెళ్లాలని అనుకున్నాం. క్యూలైనులో వెళ్లి అన్నప్రసాదం తీసుకున్నాం. అన్ని పదార్థాలు చాలా చాలా రుచికరంగా ఉన్నాయి. తృప్తిగా ఉంది. **- రాజీ, దుర్గ, హారిక, కృష్ణలంక**

కుటుంబ సమేతంగా..



మేం కుటుంబాల సమేతంగా జగన్మాత దర్శనానికి వచ్చాం. గంటలోపుగానే దర్శనమైంది. అన్నప్రసాద కేంద్రంలో అన్నపూర్ణేశ్వరి అందించిన అన్న ప్రసాదాన్ని తృప్తిగా తీసుకున్నాం. ఆహార పదార్థాలు అద్భుతంగా ఉన్నాయి. చాలా పరిశుభ్రతగా ఉంది. ఓ పక్కన కూర్చొని కుటుంబ సమేతంగా అన్న ప్రసాదాన్ని తృప్తిగా తిన్నాం. **- కరుణతేజ, సాయిమహేష్, కొత్తపేట**

11 ప్రాంతాల్లో లడ్డూ విక్రయాలు


లడ్డూలు కొనుగోలు చేస్తున్న భక్తులు


అమ్మవారిని దర్శించుకుని కనకదుర్గానగర్ మీదుగా వస్తున్న భక్తులు

భవానీపురం, న్యూస్‌టుడే : అమ్మవారి లడ్డూ ప్రసాదం అంటే ప్రతి ఒక్కరికీ ప్రీతిపాత్రమే. దసరా నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో లడ్డూ ప్రసాదాన్ని కొనుగోలు చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కనకదుర్గానగర్ వద్ద 11 కౌంటర్లు ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ కౌంటర్ల ద్వారా లడ్డూ విక్రయాలు చేస్తున్నారు.

మంత్రి ఆకస్మిక పర్యటన.. సౌకర్యాలపై ఆరా


వసతులు, సమస్యల గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి

కృష్ణలంక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకల్లో భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీసేందుకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించారు. క్యూలైన్లలో మంచి నీరు, తదితర సమస్యలపై భక్తులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దర్శనం జరుగుతున్న తీరు గురించి ఆరా తీశారు. సదుపాయాలు బాగున్నాయని, గతం కంటే మరింత మెరుగ్గా అమ్మవారి దర్శనం లభిస్తోందని భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి ముందు కృష్ణా నదికి నిత్యం ఇస్తున్న నవ హారతుల్లో మంత్రి పాల్గొన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో కె.ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కమిటీ అత్యుత్సాహం!


దేవస్థానం సిబ్బందితో వాగ్వాదానికి దిగిన సేవా కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దేవాదాయ శాఖ నియమించిన కమిటీలోని కొందరు సభ్యులు సేవను మరచి పెత్తనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. చేరిన రోజు నుంచే భక్తులు ఇబ్బందులపై కంటే తమ వారికి దర్శనాలు ఎలా చేసుకోవాలనే విషయంపై దేవస్థానం, పోలీసు సిబ్బందితో వివాదాలకు దిగుతున్నారు. క్యూలైన్లో గాలి సరిగా అందక భక్తులు సొమ్మసిల్లి పడిపోతున్నారు. కొన్ని పాయింట్ల వద్ద తాగేందుకు నీరు లభించడం లేదు. దివ్యాంగులు వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వాహనాలు అందుబాటులో ఉండటం లేదు. ఇలాంటి అంశాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన సేవా కమిటీ సభ్యులు కొందరు అధికారులు, సిబ్బందితో గొడవ పడుతున్నారు. వీరిలో కొందరు గతంలో వైకాపాలో పెత్తనం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా వీరు చేస్తున్న పనుల కారణంగా దేవాదాయ శాఖ ప్రతిష్ఠ దెబ్బ తింటోందని ఉద్యోగులు వాపోతున్నారు. దేవస్థానం అధికారులను కలిసి సమస్యలు చెప్పేందుకు కూడా అవకాశం ఇవ్వడంలేదని కొంత మంది సభ్యులు వాపోతున్నారు.

భక్తుల భద్రతకు చర్యలు


సుజనాచౌదరికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న రామారావు


ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను పలువురు ప్రజాప్రతినిధులు శనివారం దర్శించుకున్నారు. విజయవాడ పశ్చిమ, ఉండి, పెందుర్తి, కొవ్వూరు ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, రఘురామకృష్ణరాజు, రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనాచౌదరి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుందన్నారు. మోడల్ గెస్టుహౌస్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు అవసరమైన చర్యలు పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు దగ్గర ఉండి పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. భక్తులు పెరుగుతున్నందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జగన్మాత సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజ చేయించారు. మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


జస్టిస్ సుమతి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నంరాజు


ఆర్టీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొనకళ్ల నారాయణరావును పూలమాలతో సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్


వేడి పాలు పంపిణీ చేస్తూ

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థలు పలు సేవలు అందిస్తున్నాయి. వైద్యసేవలు అడుగడుగునా అందించేందుకు శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండపైన, ఘాట్ రోడ్డు మార్గంలో, క్యూ లైన్ల ప్రాంతంలో, కనకదుర్గానగర్‌లో ఇలా భక్తులకు ఆరోగ్య, ఇతర సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యం అందించేలా ఏర్పాటు చేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే పరగడుపున అమ్మవారిని దర్శించుకోవాలని వచ్చే భక్తులు, నడుచుకుంటూ వచ్చేవారికి కాళ్ల నొప్పులు, రక్తపోటు పెరగడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన భక్తులు వైద్యశిబిరాలలో వైద్యం చేయించుకునే సదవకాశాన్ని కలిగించారు. భక్తులు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు

ఇంద్రకీలాద్రిపై అమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ తమ సేవలను ఉచితంగా అందిస్తున్నారు. క్యూ మార్గంలో అమ్మ దర్శనానికి వచ్చే వృద్ధులకు, సామాన్య భక్తులకు వేడి పాలు అందిస్తున్నారు. పిల్లలు ఏడవకుండా వారికి కూడా పాలు అందిస్తున్నారు.


గాయత్రీదేవిగా చిట్టినగర్ అమ్మవారు


వీఎంసీ కాలనీలో అన్నపూర్ణాదేవిగా..


అన్నపూర్ణాదేవి అలంకారంలో విజయదుర్గ అమ్మవారు


కొత్తపేట గంగానమ్మ అమ్మవారు

అన్నపూర్ణేశ్వరీ పాహిమాం

చిట్టినగర్, న్యూస్‌టుడే : దేవీశరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులు దర్శించుకున్నారు. చిట్టినగర్‌లోని నగరాలు సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారిని శనివారం గాయత్రీదేవిగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు ధ్రువపత్రాలు అందించి ప్రోత్సహించారు. పాలఫ్యాక్టరీ వద్ద విజయదుర్గ, వీఎంసీ కాలనీలోని కనకదుర్గ, భీమనవారిపేట గంగానమ్మ అమ్మవారి ఆలయాల్లో, కొత్తపేటలోని గంగానమ్మ తల్లి గుడిలో, కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయ దేవస్థానంలో అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.


దాసాంజనేయస్వామి ఆలయం వద్ద చండీహోమం


చిన్నారులకు ధ్రువపత్రాలు అందజేత


హారతి అందుకుంటున్న భక్తులు

ఇంజినీరింగ్ విద్యార్థుల సందడి


ఆకట్టుకున్న నవదుర్గలు వేషధారణ

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఇంజినీరింగ్ విద్యార్థులకు దసరా విశిష్టతను తెలిపే రీతిలో నిర్వహించిన వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్‌లో భాగంగా దసరా వేడుకలు శనివారం నిర్వహించారు. రకరకాల ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. విద్యార్థినులు నవదుర్గల స్ఫూర్తితో అమ్మవారి వివిధ రూపాలలో చక్కటి వస్త్రాభరణాలతో ఆకట్టుకున్నారు. వేడుకల్లో అమ్మవారి పాటలు, రంగోలి వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అమరసుధీర్, ఉపాధ్యక్షులు సురేంద్ర, కోశాధికారి రాఘవయ్య, ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, డేటా సైన్స్ విభాగాధిపతి అక్బర్, కో-ఆర్డినేటర్ నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


వీఎంసీ చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు

చిట్టినగర్, న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 50వ డివిజన్‌లోని మహంతిపురం, గొల్లపాలెంగట్టు తదితర ప్రాంతాలు, 46వ డివిజన్ లంబాడీపేట అడ్డరోడ్డు, ప్రధానంగా ముక్కా అప్పారావు వీధితో పాటు 49వ డివిజన్ ప్రైజర్‌పేట, టైలర్‌పేట ప్రాంతాల్లో పండగ రోజుల్లో కూడా తాగునీటి ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆర్కే సర్వీసెస్ అనే ప్రైవేటు కాంట్రాక్టరు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. వేతనాలు ఇవ్వకపోతే పండగ ఎలా చేసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగే మోసపూరిత చర్యలను గమనించి వెంటనే టెండరు విధానం రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. ఆప్కాబ్ కార్మికులకుగా నియామకం చేసి న్యాయం చేయాలని కోరారు.

నాసిరకం కిస్మిస్ తిప్పిపంపిన అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గగుడి స్టోరుకు గుత్తేదారు నాసిరకం కిస్మిస్ బాక్సులను పంపగా ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం తిప్పి పంపారు. దసరా ఉత్సవాల్లో లడ్డూ ప్రసాదం పెద్ద మొత్తంలో తయారు చేయాల్సి ఉంటుంది. మొదటి రోజు పెద్ద సైజులో కిస్మిస్ పంపిణీ చేసిన గుత్తేదారు మూడో రోజు సైజు తగ్గిపోవడాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. పది రోజుల వ్యవధిలో స్టోర్సుకు పంపిన సరకులను ఫుడ్ సేఫ్టీ అధికారులు మూడుసార్లు తిప్పిపంపారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు


భవానీ ఘాట్ వద్ద మరుగుదొడ్లు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నది ఒడ్డున పున్నమి, భవానీ స్నాన ఘాట్‌లను కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ ఘాట్‌ల వద్ద తాగునీటిని సిద్ధంగా ఉంచాలన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటిని అందించాలన్నారు. మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సేవలు అందించాలన్నారు.

మూడో రోజు ఆదాయం రూ.45.43లక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో మూడో రోజు శనివారం వివిధ సేవలు, దర్శనం టిక్కెట్లు, లడ్డూ టోకెన్ల ద్వారా రూ.45.43 లక్షల ఆదాయం వచ్చింది. రూ.500, రూ.300, రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.19,24,000. రూ.5,19,900, రూ.4,19,600 ఆదాయం వచ్చింది. లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12లక్షలు, కేశఖండన టోకెన్ల ద్వారా రూ.83,120 ఆదాయం లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

పాత నేరస్థుల అరెస్టు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్లో ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసులో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు పాత నేరస్థులను శనివారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన జి.భార్గవరెడ్డి, గుంటూరు జిల్లాకు చెందిన పసుపులేటి చిన్న శేషయ్య విజయవాడ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు వారి బ్యాగులు తనిఖీ చేశారు. భార్గవరెడ్డి దగ్గర రూ.80 వేల విలువైన 40 గ్రాముల బంగారు గొలుసు, చిన్న శేషయ్య వద్ద 24 గ్రాముల ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బంగారం నగలు మొత్తం విలువ సుమారు రూ.3.20 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రైల్వే కోర్టులో హాజరుపరగా న్యాయమూర్తి రిమాండు విధించారు. రైల్వే డీఎస్పీ రత్నరాజు పర్యవేక్షణలో జీఆర్పీ సీఐ జె.వి.రమణ, ఆర్పీఎఫ్ సీఐ ఫతే అలీ ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్నారు.

రైలు నుంచి పడి చిన్నారికి గాయాలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైలు బోగీలోని అత్యవసరం డోర్ నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో చిన్నారికి గాయాలైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. సాయినగర్ శిర్డీ, -విశాఖపట్నం రైల్లోని ఏసీ బోగీలో ప్రయాణిస్తుండగా మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ ఎమర్జెన్సీ డోర్ నుంచి అకస్మాత్తుగా కిందపడిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు చైను లాగి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే సిబ్బంది స్పందించి రైలు విజయవాడకు చేరుకోగానే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చిన్న పిల్లలున్న తల్లిదండ్రులు అత్యవసర ద్వారం దగ్గర అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

విజయవాడ మధ్య


చూసేవారు లేక.. బతుకు బండి లాగలేక..

◆ కుమారుడికి పురుగుల మందు తాగించిన తండ్రి ◆ అనంతరం తానూ బలవన్మరణం

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే: జీవితాంతం తోడుంటుందనుకున్న భార్య.. ఏళ్ల కిందటే కాలం చేసింది. చేతికొచ్చిన కుమారుడైనా చేదోడువాదోడుగా ఉంటాడనుకుంటే.. అనారోగ్యం పాలయ్యాడు. బిడ్డను సాకడానికి ఉద్యోగం వదిలేశారు. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. బతుకు భారమైంది. ఆదరించేవారే లేకపోయారు. మరోవైపు వృద్ధాప్య బాధలు. వీటిని భరించలేని ఓ తండ్రి.. కుమారుడికి పురుగుల మందు తాగించారు. అనంతరం తానూ తాగి బలవ్మనరణం పొందిన హృదయవిదారక ఘటన విజయవాడలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ కృష్ణలంకకు చెందిన బొర్రా ప్రసాద్ (65) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. 2012లో ఈయన భార్య అనారోగ్యంతో మృతి చెందారు. కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు శివకుమార్ (32)కు అయిదు సంవత్సరాల కిందట పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి అతను మంచానికే పరిమితమయ్యారు. కుమారుడిని చూసే వారు లేకపోవడంతో ప్రసాద్.. ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉండిపోయారు. ప్రస్తుతం గుణదల ఊర్మిళానగర్‌లో ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛనుతో బతుకుతున్నారు.


మృతి చెందిన ప్రసాద్


చికిత్స పొందుతున్న శివకుమార్

ఉద్యోగం లేకపోవడం, పింఛను సరిపోకపోవడంతో బంధువుల వద్ద డబ్బులు తీసుకుంటూ.. జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తన చిన్న అత్తకు ఫోన్ చేశారు. తనకు డబ్బులు కావాలని, పంపకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. ఆమె.. ప్రసాద్ అల్లుడైన అట్లూరి దేవేందర్ ప్రసాద్‌కు ఫోన్ చేశారు. ఆయన శనివారం ఉదయం గుణదలలోని ఇంటికి వచ్చి చూశారు. అప్పటికే బొర్రా ప్రసాద్ చనిపోయాడు. మంచంలో ఉన్న శివకుమార్ కొన ఊపిరితో ఉన్నాడు. చికిత్స నిమిత్తం అతడిని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు అండగా నిలుద్దాం


నిత్యావసరాలు, దుప్పట్లు, చీరలు అందిస్తున్న శ్రీనివాస చక్రవర్తి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరింతగా ముందుకు రావాలని గొర్రి సత్యవతి ఛారిటబుల్ ట్రస్టు అధినేత గొర్రి శ్రీనివాస చక్రవర్తి పిలుపునిచ్చారు. శనివారం రాత్రి గవర్నర్‌పేటలోని ట్రస్టు కార్యాలయంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వరదల్లో పేద ప్రజలు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకునేందుకు తమ వంతు సాయంగా 50 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసరాలు, దుస్తులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు డాక్టర్ సంకె విశ్వనాథం, గొర్రి లత, గణేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

స్పందనకు వందనం


దుకాణాల సామాన్లు తీయిస్తున్న సిబ్బంది

సీతారాంపురం, న్యూస్‌టుడే : నవరంగ్ థియేటర్ వద్ద కాట్రగడ్డవారి వీధి, కస్పావారి వీధిలో ఆక్రమణలు పెరిగాయి. ద్విచక్రవాహనం వెళ్లడానికీ కష్టంగా ఉంది. స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నెల 4వ తేదీన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వీఎంసీ అధికారి మోహన్‌బాబు స్పందించారు. శనివారం సిబ్బందితో రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలను తొలగింపజేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

సీతారాంపురం, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్‌లోని వరద ముంపు ప్రాంత యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తామని సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు బీవీఎస్టీ సాయి, సీతారాంపురం మందిరం కన్వీనర్ నరసింహారావులు తెలిపారు. రాజీవ్‌నగర్‌లోని భారత వికాస్ పరిషత్ భవనంలో ఏసీ రిపేర్ శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. 19-30 సంవత్సరాల్లోపు యువకులు, పది పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. 37 రోజుల తర్ఫీదు అనంతరం ప్రముఖ ఏసీ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. శాంతినగర్‌లోని శ్రీశారదా విద్యాలయంలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణనిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99512 84459, 78934 16244 (ఏసీ రిపేర్), 99485 57070, 81252 66864 (టైలరింగ్) నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఉచితంగా వినికిడి పరికరాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : వినికిడి లోపాలు ఉన్న వారిని గుర్తించి, దీన్‌దయాళ్ శ్రావణ్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా పరికరాలు అందజేస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. శనివారం పాత ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లోపం ఉన్న 59 మందిని గుర్తించినట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా ఉంటే.. ఈ నెల 30న ఆస్పత్రి ప్రాంగణంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. డాక్టర్ జి.మాధవీనాయుడు, జె.రవితేజ, కీర్తిప్రసన్న, భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'వరద సాయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : వరద బాధితులకు అందించిన సాయంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వైకాపా సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం రూ.1,036 కోట్లు ప్రకటించిందని, దాతలు పెద్ద ఎత్తున విరాళాలు అందించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తోందని ఆయన విమర్శించారు.

విద్యార్థులకు వేద పరీక్షలు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : స్థానిక లలితామణి కల్యాణ మండపంలో స్వధర్మ స్వరాజ్య సంఘం ఆధ్వర్యంలో 132వ సాంస్కృతిక సంఘ వేదశాస్త్ర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ 10వ తేదీ వరకు విద్యార్థులకు వేదాలపై పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన వారికి ఈనెల 12న ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని నిర్వాహకులు బి.వి.ఎస్.ఎస్.మణి చెప్పారు. ఈ నెల 11న ప్రముఖ వేదపండితులు, ఘనాపాటిలను సత్కరిస్తామని పేర్కొన్నారు.

నడిచే మార్గం లేదాయే..!

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే

నత్తనడకన మరమ్మతు పనులు

బుడమేరు వరద కారణంగా నూజివీడు రోడ్డులో రాజీవ్‌నగర్, కండ్రిక పరిసరాల్లో వాకింగ్ ట్రాక్ పాడైపోయింది. గతంలో ఇది ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు చక్కగా ఉపయోగపడేది. రాజీవ్‌నగర్, కండ్రికవాసులు అనేక మంది నడిచేవారు. గత నెలలో బుడమేరు వరదలతో మట్టి కొట్టుకువచ్చింది. వరద నీటిని మళ్లించేందుకు పలు చోట్ల గండ్లు పెట్టారు. ఆ తర్వాత యుద్ధప్రాతిపదికన రోడ్లను సరిచేశారు. ట్రాక్ పనులు మాత్రం నత్తనడకన నడుస్తున్నాయి.

కుంగిపోయిన పేవర్ బ్లాక్స్.. నడకదారిలో పలు చోట్ల పేవర్ బ్లాక్స్ వేశారు. వరద కారణంగా పలు చోట్ల రోజుల తరబడి నీరు ఉండటంతో.. నేల గుల్లబారింది. పేవర్ బ్లాక్స్ కుంగిపోయాయి. వాటికి మరమ్మతులు ప్రారంభించారు. పనులు నత్తనడకన నడుస్తుండటంతో స్థానికులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.


పేరుకున్న చెత్త


పేవర్ బ్లాక్స్ ఇలా..


ఈ కాలిబాటను సరి చేయాలి..

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మధురానగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల తనిఖీ, మరమ్మతుల కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు ఆదివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 11 కె.వి. దుర్గాపురం ఫీడర్‌లోని రాజీవ్‌గాంధీ వీధి, బి.ఆర్.టి.ఎస్.రోడ్డు, దుర్గాపురం, వినాయకుడి గుడి వీధి, ఈడ్పుగంటి లక్ష్మణరావు వీధి, రజక వీధి, గణపతి వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్తు ఉండదని ఈఈ తెలిపారు.

బిల్లుల చెల్లింపులకు అవకాశం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సెలవు దినమైనప్పటికీ ఆదివారం జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని ఎస్ఈ ఎ.మురళీమోహన్ తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఆయన వివరించారు.

మంత్రి ఆకస్మిక పర్యటన.. సౌకర్యాలపై ఆరా

కృష్ణలంక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకల్లో భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీసేందుకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించారు. క్యూలైన్లలో మంచి నీరు, తదితర సమస్యలపై భక్తులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దర్శనం జరుగుతున్న తీరు గురించి ఆరా తీశారు. సదుపాయాలు బాగున్నాయని, గతం కంటే మరింత మెరుగ్గా అమ్మవారి దర్శనం లభిస్తోందని భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు మూడు, నాలుగుసార్లు భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, వారు సూచించిన ప్రకారం అదనపు సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేయమని పదేపదే సూచిస్తున్న విషయాన్ని అధికారులకు మంత్రి గుర్తు చేశారు. ఉత్సవాలు జరిగే మిగిలిన రోజుల్లో మంచినీళ్లతో పాటు పాలు, మజ్జిగ పంపిణీ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అమ్మవారి దర్శనానికి ముందు కృష్ణా నదికి నిత్యం ఇస్తున్న నవ హారతుల్లో మంత్రి పాల్గొన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో కె.ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.


వసతులు, సమస్యల గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి రామనారాయణరెడ్డి

భక్తులకు అన్నదానం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో అన్నపూర్ణాదేవి అలంకారం రోజున భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని గవర్నర్‌పేటకు చెందిన భాస్కరరావు, విజయకుమారి దంపతులు పేర్కొన్నారు. టిఫిన్ సెంటరు నిర్వహించే వీరు.. ఏటా అన్నదానం నిర్వహిస్తున్నారు. శనివారం గవర్నర్‌పేటలో ఈ కార్యక్రమాన్ని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, శ్రీధర్ కోచింగ్ సెంటర్ అధినేత శ్రీధర్‌లు ప్రారంభించారు. 5వేల మందికి అన్నదానం చేశారు


ఆహార పదార్థాలు వడ్డిస్తున్న బాలస్వామి, శ్రీధర్. పక్కనే భాస్కరరావు

పేర్లు నమోదు చేసుకోండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ విజ్ఞప్తి చేసింది. శనివారం సూర్యారావుపేటలోని ఉప కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు, ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్. పరిధిలో లేని దుకాణాల్లో పనిచేసే కార్మికుల వివరాలను ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేశారు. సంక్షేమ బోర్డు.. ప్రసూతి సాయం, సహజ మరణం, ప్రమాద మరణం, అంగ వైకల్య పరిహార పథకాలు అమలు చేస్తోంది. వీటిపై అవగాహన కలిగించారు. అర్హుల వివరాలను ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసి, గుర్తింపు కార్డులు అందించారు. సంక్షేమ బోర్డులో నమోదు చేసేందుకు అవసరమైన దరఖాస్తులను పలువురు కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు బి.కిషోర్‌కుమార్, పి.మహేశ్వరరెడ్డి, పి.శ్రీనివాసరావు, టి.రాజేష్, పి.రాంకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


కార్మికులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న అధికారులు


నేతాజీ కాలనీలోని అంకమ్మతల్లి శక్తి పీఠంలో..


గద్దె వెంకట్రామయ్య నగర్‌లో..


గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో..


కస్తూరిబాయిపేటలోని ముత్యాలమ్మ గుడిలో..


కార్మికపురం దుర్గామల్లేశ్వర దాసాంజనేయస్వామి దేవస్థానంలో..

ఆకలితీర్చే ఆదిపరాశక్తి


మధురానగర్ మెయిన్ రోడ్డులో అన్నపూర్ణాదేవిగా దుర్గా మాత

